
విరాట్
స్టెఫాన్ జ్వైగ్
స్వేచ్ఛానువాదం
పానుగోటి కృష్ణారెడ్డి

# విరాట్

మూలం : స్టెఫాన్ త్సై్వక్

స్వేచ్ఛానువాదం : పొనుగోటి కృష్ణారెడ్డి

మంచి పుస్తకం

Virata by Stefan Zweig

# విరాట్


| | | |
|---|---|---|
| మూలం | : | స్టెఫాన్ త్స్వైక్ |
| స్వేచ్ఛానువాదం | : | పొనుగోటి కృష్ణారెడ్డి |
| ముఖచిత్రం | : | మోహన్ |
| ప్రథమ ముద్రణ | : | 12 డిసెంబర్, 1999 |
| ఆరవ ముద్రణ | : | మంచి పుస్తకం, మే 2010 |
| ప్రతులు | : | 2000 |
| వెల | : | రూ. 25/- |
| ISBN | : | 978-93-80153-31-5 |
| ప్రచురణ | : | మంచి పుస్తకం |
| ప్రతులకు | : | **మంచి పుస్తకం**<br>12-13-439, వీధి నెం. 1,<br>తార్నాక, సికింద్రాబాదు-500 017<br>www.manchipustakam.in<br>info@manchipustakam.in<br>ఫోన్: 9440746614<br>**విశాలాంధ్ర అన్ని బ్రాంచీలలో**<br>**నవోదయ బుక్‌హౌస్**, హైదరాబాద్ |
| ముద్రణ | : | చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్<br>ఫోన్: 040-27678411 |

మా అబ్బాయి

**విరాట్‌కు**

– కృష్ణారెడ్డి

**12. 12. 1999**

# గోర్కీ నుంచి త్స్వైక్ దాకా

కొన్ని సమయాల్లో ఒకళో ఎవరో తారసపడతారు. ఎక్కడో చూశాం అనిపిస్తుంది. గుర్తురారు. గింజుకుంటాం. అయినా గుర్తురాదు. విరాట్ మొదటిసారి చదవటం పూర్తి చేసినప్పుడు అలాగే అన్పించింది. తర్వాత్తర్వాత గుర్తొచ్చింది. స్తెఫాన్ త్స్వైక్, షోలహూవ్ (ఫేట్ ఆఫ్ ఎ మాన్), హెమింగ్వే (ఓల్డ్‌మాన్ అండ్ ది సీ), 1953లో ద మాన్ హు ప్లాంటెడ్ ట్రీస్ రాసిన జీన్ జియానో ఒకే పాలపుంత మీది నుంచే నడిచి వెళ్ళారని.

దాంకోస్ బర్నింగ్ హార్ట్ అన్న ప్రాచీన బైబిల్ కథని గోర్కీ (1868–1936) తన సొంత శైలిలో రాశారు. గడ్డి ఏపుగా పెరిగి వున్న సువిశాలమైన స్టెప్పీలో ఒక గిరిజన తెగ ఉంటుంది. వాళ్ళు బలమైన మనుషులు. సాహసికులు. భయం తెలియని వాళ్ళు. ఒక రోజు మరో తెగ వాళ్ళు హఠాత్తుగా వచ్చి దాడి చేస్తారు. దగ్గరలోనే దట్టమైన అడవిలోకి వీళ్ళు పారిపోతారు. అది భయానకమైన కీకారణ్యం. పెను వృక్షాల కొమ్మలు పెనవేసుకుపోయి పైన ఆకాశం కనిపించదు. చీకటి. దగ్గర్లో ఓ కొలను. కొందరు నీళ్ళు తాగుతారు. ఆ నీటిలో విషపు ఆవిర్లు. ఇద్దరో ముగ్గురో చనిపోతారు. ఆడవాళ్ళ ఏడుపులు. కటిక చీకటి. అడవి గాలి మృత్యు సంగీతం. దిక్కు తోచదు. భయంతో బిక్క చచ్చిపోతారు. ఆ తెగలో అందమైన యువకుడు దాంకో. "ఏదో ఒకటి చెయి," అని జనం అడుగుతారు. దాంకో లేస్తాడు. పదండి అంటాడు. ముందు నడుస్తాడు. ఎంత దూరం వెళ్ళినా రాళ్ళూ, చీకటీ, గాయాలు. దారీ తెన్నూ లేని ప్రయాణం. అడవిలో హఠాత్తుగా తుఫాను. భయంతో దాంకోని తిడతారు జనం. మమ్మల్ని చంపడానికే తీసుకెళ్తున్నావు, మేమే నిన్ను చంపేస్తాం అంటారు. అంతలో దాంకో కళ్ళలో వెలిగే జ్వాలని చూసి భయపడతారు. దాంకో ఒళ్ళంతా నిప్పులా వెలుగుతుంది. దాంకో కుడి చేత్తో ఛాతీని చీలుస్తాడు. గుండెను బయటకి తీసి రెండు చేతుల్తో ఎత్తి పట్టుకుంటాడు. కటిక చీకటి మాయం అవుతుంది. మండే సూర్యునిలా గుండె కాంతులు వెదజల్లుతుంది. అలాగే నడుస్తుంటాడు దాంకో.

వెలుగు, వెనక జనం. చాలా దూరం వెళ్ళాక అడవి పెద్ద చప్పుడుతో చీలి వీళ్ళకి దారి ఇస్తుంది. దాటి పోగానే అడవి మూసుకుపోతుంది. పెద్ద మైదానం. ఏపుగా పెరిగిన గడ్డి, సూర్యాస్తమయ సమయం. సరస్సులో నీళ్ళు దాంకో గుండె లోంచి కారిన రక్తంలా ఎర్రగా మెరుస్తుంటాయి. స్వేచ్ఛ. జనం ఆనందంలో మునిగితేలి దాంకో సంగతే పట్టించుకోరు. ఒక చెట్టు మొదట్లో కూలిపోయి దాంకో చనిపోతాడు. గుండె అతని పక్కనే వెలుగుతూ ఉంటుంది. ఒక మూర్ఖుడు దాన్ని కాలితో నలిపేస్తాడు. అది అన్ని వైపులకీ నీలి కాంతి పుంజాలని వెదజల్లుతుంది అని చాలా పొయిటిగ్గా, ఫిలసాఫికల్‌గా కథని ముగిస్తాడు గోర్కీ.

స్తెఫాన్ త్స్వైక్ విరాట్ ముగింపూ, గోర్కీ దాంకో బర్నింగ్ హార్ట్ ముగింపూ మానవ జీవన సాఫల్యం గురించి మనకి స్పష్టంగా ఒక దారినే చూపిస్తాయి.

విరాట్ ఒక అరుదైన ఆత్మానుభవం. విరాట్ చదివాక ఓ చిరుగు చొక్కా రిక్షాపుల్లర్ తాత్వకుడిగా కనిపిస్తాడు. ఓ గొప్ప కోటీశ్వరుడు లేకి మనిషిగా అనిపిస్తాడు. There is no past, no future, only the greedy present అన్నట్టుగా ఉండే ఈ senseless rat raceని చూస్తే విరాట్ లాంటి పుస్తకాలతో ఇక్కడెవరికీ అవసరం లేదని అనిపిస్తుంది.

**– ప్రకాష్**

# ఎందుకీ అనువాదం?

నేను పదో తరగతి చదివే రోజుల్లో 'విరాట్' చదివాను. నాకు ఎంతగా నచ్చిందంటే అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం వంద సార్లయినా చదివుంటాను. విరాట్ పాత్ర నా జీవిత దృక్పథం మీద, జీవన విధానం మీద చాలా ప్రభావం చూపింది.

విరాట్ నవలికను చాలా మంది చేత చదివించాను. కొందరు అడిగితే ఫొటోస్టాట్ కాపీలు తీసి ఇచ్చాను. చదివిన వాళ్ళందరిదీ ఒకటే అభిప్రాయం. సబ్జక్ట్ అద్భుతంగా ఉంది. అనువాదం ఇంకొంచం బావుంటే బావుండేది అని. రమేష్ అనే అతను 1964లో దీన్ని అనువదించాడు. అతన్ని కలిసి వాక్య నిర్మాణం అంత క్లిష్టంగా లేకుండా సరళమైన తెలుగులోకి తిరగరాయిద్దాం అనుకున్నాను. కాని అతన్ని గురించి గాని, ఆ పబ్లిషర్ గురించి గాని ఎంత ప్రయత్నించినా వివరాలు తెలియలేదు. ఆ ప్రయత్నం మానుకున్నాను.

విరాట్ రచయిత స్టెఫాన్ త్స్వైక్ గురించి, అతని ఇతర రచనలు గురించి నాకు తెలిసిన సాహితీ ప్రియుల్ని అడిగాను. ఆయన గురించి తెలియదని చెప్పారు. గురువుగారు శ్రీ నండూరి రామమోహనరావుగారు, శ్రీమతి అబ్బూరి ఛాయాదేవిగారు త్స్వైక్ గురించి చాలా వివరాలు చెప్పారు. ఛాయాదేవిగారు త్స్వైక్ కథలు కొన్నింటిని '50 ప్రాంతాల్లో అనువదించారు. అవీ కావ్య భాషలో ఉన్నాయి. ఆమె దగ్గర తీసుకుని వాటిని చదివాను. వాటిలో నాకు వచ్చిన విరాట్ గాని, నండూరిగారికి ఇష్టమైన 'ది రాయల్ గేమ్' గాని లేవు. అయినా ఆ కథల్ని సంస్కరించి ప్రచురిస్తే బావుంటుందని కోరాను. ఆమె కూడా అదే ప్రయత్నంలో ఉన్నట్లున్నారు. కొద్ది రోజుల తరువాత ఆ కథల్ని ఆధునిక ప్రమాణ భాషలోకి మార్చి పునర్ముద్రించారు. అందులో నాకు బాగ నచ్చిన కథ 'అపరిచిత లేఖ'.

ఒకసారి అబిడ్స్ పాత పుస్తకాల షాపుల్లో వెతుకుతుంటే – నా అదృష్టం కొద్దీ స్టెఫాన్ త్స్వైక్ కథల సంపుటి దొరికింది. అందులో విరాట్‌తో పాటు నేను చదవాలనుకున్న కథలు కూడా ఉన్నాయి.

విరాట్ నవలికను ఇంగ్లీషులో చదివాక ఇంకా చాలా బాగా నచ్చింది. ఎవరితోనైనా అనువాదం చేయించి ప్రచురించాలనుకున్నాను. సాధ్యం కాలేదు. మిత్రుల సలహాపై ధైర్యం చేసి మొట్టమొదటిసారిగా ఈ అనువాదం చేశాను.

విరాట్‌ని కథగా పేర్కొన్నారు కాని ఆ రచనలోని సంఘటనలు, సన్నివేశాలు, పాత్ర చిత్రణ, వాతావరణంలోని విస్తృతిని బట్టి దాన్ని నేను నవలికగా భావిస్తున్నాను. ఈ నవలికను ప్రచురించమని ప్రోత్సహించిన శ్రీ నండూరి రామమోహనరావుగారికి, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారికి, కె.ఆర్.కె.గారికి, డి.మధుసూదనరావుగారికి, శాంతా బయోటెక్నిక్స్ వరప్రసాదరెడ్డిగారికి, ముఖచిత్రం వేసిచ్చిన మోహన్‌గారికి, 'ముందు మాట' రాసిచ్చిన ప్రకాష్‌గారికి కృతజ్ఞతలు.

**– పొనుగోటి కృష్ణారెడ్డి**

(ponugoti6562@yahoo.co.in)

# విరాట్

బుద్ధ భగవానుడు ఈ భూమి మీద అవతరించడానికి కొద్ది రోజుల ముందు వీరవాఘ రాజ్యంలో ఒక మహోన్నత వ్యక్తి జీవించాడు. అతని పేరు విరాట్. గొప్ప యోధుడు. కత్తి యుద్ధంలో అసమాన ప్రతిభాశాలి, గురితప్పని విలుకాడు, వజ్ర సమానమైన బాహుబలుడు, అంతులేని ధైర్యశాలి. గంభీరమైన విగ్రహం, భీతి ఎరగని చూపు ఆయనవి. ఆయన నిండుకుండలా తొణకని మనిషి, నిత్యనిష్ట గలవాడు, పవిత్రుడు, శాంత స్వభావుడు. ఆయన ఆవేశపడగా, కోపంగా మాట్లాడగా ఎవరూ చూడలేదు.

ఆయనకు రాజంటే గౌరవం, భక్తి. విరాట్ పరిచయం వున్న వ్యక్తులకు ఆయనంటే పూజ్యభావం. ఆయన ఇంటి ముందు నుంచి వెళ్ళేవాళ్ళు ఎవరైనా గౌరవ సూచకంగా తలవంచుకు వెళ్ళేవాళ్ళు, పసిపిల్లలు మెరుస్తున్న ఆయన కళ్ళను చూసి చిరునవ్వులు చిందించేవాళ్ళు. మధ్యవర్తిగా ఆయన చెప్పే తీర్పుల్ని ఆ ప్రాంత వాసులంతా శిరోధార్యంగా భావించేవాళ్ళు.

ఉన్నట్టుండి ఒక రోజు రాజుగారికి పెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది. రాజ ప్రతినిధిగా, వీరవాఘ రాజ్యంలో సగభాగాన్ని పరిపాలిస్తున్న రాజుగారి బావమరిదికి రాజ్యం మొత్తాన్ని ఆక్రమించాలన్న అత్యాశ పుట్టింది. రాజుగారి సైన్యంలోని మెరికల్లాంటి యోధులకు లంచాలిచ్చి తనవైపు తిప్పుకున్నాడు. పూజారులనూ లోబరుచుకున్నాడు. ఆ రాజ్యానికి పవిత్ర రాజ చిహ్నంగా ఎన్నో వేల సంవత్సరాల నుంచి రాజసరోవరంలో ఉంటున్న హంసల్ని రాత్రికి రాత్రే పూజారుల ద్వారా తరలించేశాడు. తనకు అందుబాట్లో ఉన్న ఏనుగుల్ని సేకరించుకున్నాడు. రాజు పట్ల కోపంగా ఉన్న పర్వతవాసుల్ని చేరదీసి తన సైన్యంలో కలుపుకుని రాజధాని మీదికి దండెత్తాడు.

రాజాజ్ఞ మేరకు కోట ప్రాకారాలపై సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా నగారాలు మోగించారు, గంటలు కొట్టారు. రాత్రి కాగానే కోట గోడ గోపురాలపై పెద్ద కాగడాలు వెలిగించారు. ఆ మంటలపై చేపల పొలుసులు చల్లారు. ఈ పొలుసులు మంటపై పడగానే పసుపు రంగు వెలుతురు వచ్చేది. అది ప్రమాద సంకేతం. కోటకు ప్రమాదం ఏర్పడింది, రండి అని ప్రజలకు పిలుపు. అయితే ప్రజలు ఎక్కువగా రాలేదు. వాళ్ళు భయపడిపోయారు. రాజహంసలు దొంగిలింపబడ్డాయన్న విషయం రాజ్యం నలువైపులా తెలిసిపోయింది. సైన్యంలో రాజుగారికి ఎంతో విశ్వాసపాత్రులుగా పేరుపొందిన గజదళాధిపతి, సేనాధిపతి కూడా శత్రువులతో కలిసిపోయారు. దాంతో మిగిలిన కొద్దిమంది సర్దార్లు కూడా లోలోపలే ఒణికిపోతున్నారు.

మందలు, మందలుగా నౌకర్లు, బానిసలు ఉన్నారు తప్ప కోట రక్షణ బాధ్యత అప్పగిద్దామంటే విశ్వాసపాత్రుడైన సర్దార్ ఒక్కడు కూడా కనిపించలేదు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం రాజుగారి వ్యవహారశైలి. ఆయన కఠిన హృదయుడు. చిన్న తప్పులు చేసినా పెద్ద శిక్షలు విధించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. సామంత రాజుల నుంచి కప్పం వసూలు చేయడంలో నిర్దయగా వ్యవహరిస్తాడు. అందువల్ల ఇలాంటి ఆపద సమయంలో వాళ్ళ సాయమర్థించి ఆయన భంగపడ్డాడు.

ఈ విపత్కర పరిస్థితుల్లో తనను ఆదుకోగల వాళ్ళు ఎవరా అని ఆలోచిస్తూ ఉండగా రాజుగారికి తన పట్ల అచంచల భక్తి విశ్వాసాలుగల విరాట్ గుర్తొచ్చాడు. వెంటనే పల్లకీ ఎక్కి విరాట్ ఇంటికి వెళ్ళాడు. రాజుగారు పల్లకి దిగగానే విరాట్ సాష్టాంగ నమస్కారం చేశాడు. కాని విరాట్ ముందు రాజుగారు దీనంగా, యాచకుడిలా కనిపించాడు. తన సైన్యానికి నాయకత్వం వహించి శత్రువును ఎదుర్కోవలసిందిగా కోరాడు. రాజుగారికి విరాట్ ప్రణామం చేసి "మీ ఆజ్ఞ శిరోధార్యం. విద్రోహాగ్నిని అణిచిగాని తిరిగి ఈ ఇంట్లో అడుగుపెట్టను," అని ప్రతిజ్ఞ చేశాడు.

వెంటనే విరాట్ తన కొడుకుల్ని, స్వజనుల్ని, బానిసల్ని, మిగిలిన సైనికుల్ని, రాజభక్తుల్ని సమీకరించి శత్రువుపైకి యుద్ధానికి బయలుదేరాడు. అడవిగుండా ప్రయాణించి సూర్యాస్తమయ సమయానికి వాళ్ళంతా ఒక నదీ తీరానికి చేరుకున్నారు.

సరిగ్గా ఆ నది ఆవలి తీరాన్నే అసంఖ్యాకమైన శత్రుసేన విడిది చేసి ఉంది. తమ సంఖ్యాబలం, వీరాధివీరులైన యోధులు కొందరు తమ సైన్యంలో ఉండడంతో తమకు ఎదురులేదు, విజయం తమదేనన్న ధైర్యంతో వారు ఉన్నారు. అందుకే ఈ రాత్రికి విశ్రాంతి తీసుకుని మరునాటి ఉదయం నదిని దాటి కోటపై దాడి చేయవచ్చునే ఉద్దేశంతో ఉన్నారు. కొద్దిమంది మాత్రం మరునాడు నదిని దాటడానికి వీలుగా పెద్ద పెద్ద చెట్లను నరికి నదిపై వంతెన నిర్మిస్తున్నారు.

ఈవలి తీరాన విరాట్ సైన్యం మకాం వేసింది. విరాట్ ఒక పులిని వేటాడుతూ నదీ తీరాన్నే కొంత దూరం పోయినప్పుడు అక్కడ ఒక రేవు ఉన్నట్టు గుర్తించాడు. వెంటనే వచ్చి సైన్యాన్ని సమాయత్తపరిచాడు. అర్ధరాత్రి కాగానే తన సైన్యాన్ని తీసుకుని రేవు దాటి హఠాత్తుగా శత్రు సేనలపైకి విజృంభించాడు. విరాట్ సైనికులు మండుతున్న కాగడాల్తో ఏనుగుల్ని భయపెట్టి చెల్లాచెదురు చేశారు. అర్ధరాత్రి వేళ ఏనుగులు గందరగోళంగా పరుగెత్తడంతో నిద్ర నుంచి లేచిన శత్రువులు ఎవరి దారిన వాళ్ళు పరుగులు తీశారు.

రాజ్య కాంక్షతో యుద్ధానికి సిద్ధపడ్డ రాజుగారి బావమరిది గుడారంలో ఉన్నాడు. అందరికన్నా ముందుగా విరాట్ ఆ గుడారంలోకి ప్రవేశించాడు. లోపలికి అడుగు పెట్టీ పెట్టగానే ఇద్దరిని యమపురికి పంపించాడు. మూడవవాడు ఆయుధం అందుకునేలోపే వాడిని తెగనరికాడు. ఆ చీకటిలోనే మరో ఇద్దరితో పోరాడి ఒకడి శిరస్సు ఖండించాడు. మరొకడిని బల్లెంతో పొడిచి పరలోకానికి పంపాడు. వాళ్ళంతా నిర్జీవులై కుప్పకూలాక, ఆ గుడారంలో ఉన్న పవిత్ర రాజచిహ్నాలైన హంసల్ని ఎవరూ దొంగిలించుకుపోకుండా విరాట్ ఆ గుడారం వాకిలి దగ్గరే కాపలా కాశాడు. అయితే ఎవరూ రాలేదు. విజయోత్సాహంతో విరాట్ సైనికులు శత్రువుల్ని తరుముకువెళ్ళారు. కొద్ది సేపటికి ఆ రణగొణ ధ్వని సద్దుమణిగింది. ఖడ్గం చేతబూని, తనతో వచ్చిన యోధుల కోసం నిరీక్షస్తూ ప్రశాంతంగా గుడారం వాకిలి దగ్గర కూర్చున్నాడు విరాట్.

కొంతసేపటికి అరుణోదయమయింది. సూర్యుడి నునులేత కిరణాలకు తాటిచెట్ల ఆకులు పసిడి ఎరుపుతో ప్రకాశిస్తున్నాయి. నదిలో వాటి ప్రతిబింబాలు వెలుగుతున్న కాగడాల్లా అగుపిస్తున్నాయి. తూర్పున ఆకాశంపై పెద్ద గాయంలా, రక్తపు ముద్దలా కనిపిస్తున్నాడు సూర్యుడు. సూర్యోదయం కావడంతో విరాట్ అక్కడి నుంచి లేచి నది వద్దకు వెళ్ళాడు. తన దుస్తుల్ని తీరాన ఉంచి నీళ్ళల్లోకి దిగాడు. చేతికి, ఒంటికి అయిన రక్తాన్ని నీళ్ళతో కడుక్కున్నాడు. చేతులు చాపి భగవంతుణ్ణి ప్రార్థించాడు. ప్రభాత సంధ్య ధవళ కాంతిలో ఒడ్డుకుచేరి, దుస్తులు ధరించాడు. రాత్రి చీకట్లో జరిగిన యుద్ధంలో ఎవరెవరు చనిపోయిందీ గమనించడానికి విరాట్ గుడారం వద్దకు వెళ్ళాడు.

అక్కడ దృశ్యం బీభత్సంగా ఉంది. శవాల కళ్ళు తెరుచుకుని ఉన్నాయి. ముఖాలు భయంతో బెదిరిపోయినట్లున్నాయి. రాజుగారి బావమరిది తల తెగి ఒకచోట పడివుంది. మరో పక్కన వీరవాఘు సేనాపతిగా ఉండి శత్రువుతో చేతులు కలిపిన రాజద్రోహి గుండెల్లో కత్తిపోటుతో చచ్చి పడివున్నాడు. విరాట్ ఆ శవాల కళ్ళను మూసాడు. రాత్రి తాను చంపిన మిగిలిన వాళ్ళ శవాలను చూడడానికి ముందుకు నడిచాడు. రెండు శవాల్ని విరాట్ గుర్తించలేకపోయాడు. వాళ్ళు అపరిచితులు. బహుశా వాళ్ళు విద్రోహి బానిసలై ఉండవచ్చు.

ఆ శవాలను చూస్తూ ముందుకు సాగుతున్న విరాట్ చివరన పడివున్న శవాన్ని చూసి నిశ్చేష్టుడైపోయాడు. విరాట్ కళ్ళు మసకలుబారాయి. శరీరం అదుపు తప్పింది. స్పృహ తప్పినంత పనయింది. ఆ శవం తన అన్న బేలంగర్‌ది. అతనొక పర్వతరాజు. ఆ విద్రోహికి యుద్ధంలో సాయపడటానికి వచ్చాడు. చీకట్లో అన్నని గుర్తించలేక చంపేశాడు. కొన ఊపిరితో ఉన్నాడేమో రక్షించుకుందామని వంగి గుండె కొట్టుకుంటోందేమోనని చూశాడు. కాని అది శాశ్వతంగా ఆగిపోయింది. అతని ప్రాణవాయువులెప్పుడో గాలిలో కలిసిపోయాయి. కాని అతని నల్లని మెరుస్తున్న నేత్రాలు విరాట్ హృదయాన్ని చీలుస్తున్నట్టు చూస్తున్నాయి. విరాట్ అతి కష్టంమీద ఊపిరి పీల్చుకోగలిగాడు. నీరసంగా ఆ శవాల మధ్య కూలబడ్డాడు. ఆ శవాల మధ్య తానూ ఒక శవంలా అనిపించిందతనికి. తనను అపరాధిలా, హంతకుడిలా నిలదీస్తున్న తన అన్న చూపులను తట్టుకోలేక తన దృష్టిని మరోవైపుకి మళ్ళించాడు.

కొద్దిసేపటికి దగ్గరలో సైనికుల కేకలు వినిపించాయి. వాళ్ళ హృదయాల్లో ఆనందం ఉప్పొంగుతోంది. దోచుకున్న సంపదలతో వాళ్ళు పక్షుల్లా ఎగిరి గంతులేస్తున్నారు. విద్రోహి, అతని అనుచరులు హతమై, రాజహంసలు క్షేమంగా లభించినందుకు ఆనందంతో విరాట్ దుస్తుల్ని ముద్దుపెట్టుకున్నారు. సంతోషంతో నృత్యం చేశారు. విరాట్‌లాంటి యోధుడు లేడని, వీరాధివీరుడని జయజయ ధ్వానాలు చేశారు.

సైనికులంతా తిరిగి రాగానే వాళ్ళుదోచుకున్న సంపదనంతటినీ బళ్ళపై పేర్పించారు. ఆ బరువుకు బళ్ళ చక్రాలు నేలలోకి కుంగిపోయాయి. ఈ బళ్ళను లాగడానికి అదనంగా మరికొన్ని దున్నల్ని కట్టారు.

రాజుగారికి ఈ విజయవార్త అందచేయడానికి ఒక వార్తాహరుణ్ణి ముందుగా పంపారు. మిగిలిన వాళ్ళంతా విజయోత్సాహంతో ఈ బళ్ళ వెంట నడిచారు.

అందరూ ఆనంద పరవశులై ఉంటే విరాట్ మాత్రం నిర్లిప్తంగా, కళ్ళ ముందు జరుగుతున్నదంతా ఒక స్వప్నంలా చూస్తూ కూర్చున్నాడు. శవాల దుస్తులు తొలగించడానికి సైనికులు ప్రయత్నించినప్పుడు మాత్రం పెదవి విప్పాడు, వద్దని వారించాడు. శవాలను దహనం చేయడానికి చితులు పేర్చవలసిందిగా కోరాడు. శత్రువుల శరీరాల్ని ముక్కలు ముక్కలుగా నరికి కాకులకు గద్దలకు వెయ్యాల్సిందిపోయి, వాళ్ళ పట్ల ఆయన దయ చూపిస్తున్నందుకు అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన చెప్పినట్టు చేశారు. విరాట్ స్వయంగా ఆ చితులకు అగ్ని సంస్కారం గావించాడు. చితులు పూర్తిగా మండి, నిప్పు కణికలు బూడిదై నేలమీద కలిసిపోయేదాకా తల వంచుకుని విరాట్ అక్కడే నిలబడిపోయాడు.

శత్రు సైనికులు సగం నిర్మించిన వంతెనను ఈలోగా విరాట్ సైనికులు పూర్తి చేశారు. మొదట కొంతమంది యోధులు వంతెన దాటారు. తరువాత బానిసలు, ఆ తరువాత అశ్వికదళ సర్దారులు వంతెన దాటారు. అంతకు ముందే విరాట్ చాలా మంది సైనికుల్ని పంపేశాడు. వాళ్ళ కేకలకి, పాటలకి విరాట్ మానసిక స్థితికి పొత్తు కుదరలేదు. వంతెన మధ్య నిలబడి నదీ ప్రవాహాన్ని విరాట్ చాలాసేపు గమనించాడు. నదిని దాటిన వాళ్ళు, దాటుతున్న వాళ్ళు, దాటబోయేవాళ్ళు అంతా విరాట్ వంక ఆశ్చర్యంగా చూశారు. స్వర్గాన్ని సవాల్ చేస్తున్నాడా అన్నట్లు ఖడ్గాన్ని పైకెత్తాడు. కాని చెయ్యి కిందికి దించుతున్నప్పుడు చేతి వేళ్ళ పట్టు తప్పి ఖడ్గం నీళ్ళల్లో పడిపోయింది. పొరపాటున ఖడ్గం నీటిలో జారిపడిందని, దాన్ని తీసుకురావడానికి నది ఇరు తీరాల నుంచి ఇద్దరు నీటిలోకి దూకారు. దాన్ని వెతికే ప్రయత్నం చేస్తుండగా విరాట్ వద్దని సైగచేసి ముందుకు సాగాడు. చూస్తున్న వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. ఇళ్ళకు వెళుతున్నామన్న ఆనందంలో ఆంతా తలమునకలవుతుంటే విరాట్ మాత్రం అంతులేని వ్యథతో ఎవ్వరితోనూ పెదవి విప్పి మాట్లాడలేదు.

వీరవాఘు సింహద్వారం ఇంకా చూపుకందని దూరంలో ఉండగానే తెల్లని ధూళి మేఘాలు ముందుకు తరలి రావడం కనిపించింది. రాను రాను ధూళిమేఘాలు తెరిపినబడ్డాయి. ముందు పరుగున వస్తున్న సైనికులు, ఆశ్వికదళం కనిపించింది.

సైన్యాన్ని చూడగానే వాళ్ళు ఆగారు. రహదారి మీద తివాచీలు పరిచారు. రాజుగారు దిగబోతున్నారు అనే దానికి ఇదో నిదర్శనం. జన్మించింది మొదలు మరణించేదాకా రాజుగారు మట్టిపై పాదం మోపకూడదు. అందుకే తివాచీలు పరిచారు. కొద్దిసేపటికి గజారూఢుడై రాజుగారు వేంచేశారు. సైన్యం ముందుకు వచ్చి ఆ గజరాజు వంగాడు. రాజుగారు ఏనుగు అంబారీ పైనుంచి దిగి తివాచీ మీద నిలబడ్డారు. రాజుగారికి ప్రణమిల్లే ఉద్దేశంతో విరాట్ ముందుకు రాగానే రాజుగారే ముందుకు వెళ్ళి విరాట్‌ను ఆలింగనం చేసుకున్నారు. తక్కువస్థాయి వాళ్ళెవరికీ ఇంతకు ముందు ఎప్పుడూ ఇలాంటి గౌరవం జరగలేదు. విరాట్ రాజహంసల్ని మహారాజుగారి ముందుకు తెప్పించాడు. ఆ హంసలు తమ తెల్లని రెక్కల్ని విదిలించే సరికి ప్రజలు హర్షాధ్వానాలు చేశారు. ఆ శబ్దాలకు గుర్రాలు బెదిరి వెనక కాళ్ళమీద నిలబడ్డాయి. ఏనుగుల్ని అదుపులో ఉంచడం మావటి వాళ్ళకు కష్టమైంది. ఈ విజయోత్సాహం మధ్య రాజుగారు విరాట్‌ను మరోసారి కౌగిలించుకున్నారు.

తరువాత తమ పూర్వీకుల ఖడ్గాన్ని మోసుకువచ్చిన సైనికుణ్ణి పిలిచారు. అతని దగ్గరనుంచి రాజుగారు ఆ విలువైన ఖడ్గాన్ని అందుకున్నారు. అది తమ వంశ ప్రథమ రాజపుత్ర వీరుని ఖడ్గం. ఏడు వందల సంవత్సరాలనుంచి ఆ ఖడ్గాన్ని రాజుగారి ఖజానాలో భద్రంగా ఉంచారు. వజ్రాలతో పొదిగిన దాని పిడి మిరిమిట్లు గొల్పుతోంది. దాని అంచున

విజయ సంకేత మంగళ వాక్యాలను సువర్ణాక్షరాలతో లిఖించారు. వాటిని సిద్ధులు, మహా పండితులు మాత్రమే చదవగలరు. అలాంటి విశిష్ట ఖడ్గాన్ని విరాట్‌పట్ల కృతజ్ఞతా సూచకంగా, ఇకనుంచి తన సర్వ సైన్యాధ్యక్ష పదవిని అప్పగిస్తున్న దానికి గుర్తుగా విరాట్‌కు బహూకరించబోయారు.

కాని విరాట్ వినయంగా శిరస్సు వంచి నమస్కరిస్తూ "మహారాజా తమరు అత్యంత దయామయులు, నేను మిమ్మల్ని ఒక కోరిక కోరవచ్చా?" అని అడిగాడు.

"ఆ కోరిక ఏమిటో చెప్పక ముందే దాన్ని అనుగ్రహిస్తున్నాను. నువ్వు కోరుకుంటే నా అర్ధరాజ్యం ఇవ్వడానికైనా సిద్ధమే," అన్నారు.

"అయితే మహారాజా ఈ ఖడ్గాన్ని తిరిగి ఖజానాకు పంపండి. ఈ యుద్ధంలో నా సొంత అన్ననే చేజేతులా చంపుకున్నాను. మా తల్లికి మేమిద్దరమే బిడ్డలం. నాతోపాటే అతన్నీ పెంచింది మా అమ్మ. అతన్ని చంపేశాను. అతను నా అన్న అని తెలిశాక జీవితంలో ఇక ఎప్పుడూ కత్తి పట్టనని మనస్సాక్షిగా ప్రమాణం చేశాను," అని వినయంగా చెప్పాడు విరాట్.

మహారాజుగారు ఆశ్చర్యంగా విరాట్‌వైపు చూసి "అలాగే నువ్వు యుద్ధం చేయనవసరం లేకుండానే నా సేనాధిపతిగా ఉండు. నువ్వు ఉన్నంత కాలం శత్రువులనుంచి నాకు ఎలాంటి భయమూ ఉండదు. నువ్వు కాబట్టే ఇంత తక్కువ సైన్యంతో నీ తెలివితేటలను ఉపయోగించి అంత బలమైన శత్రువుని జయించగలిగావు. నా ఆజ్ఞను మన్నించి ఈ ఖడ్గాన్ని తీసుకో. ఇది అధికారానికి చిహ్నం. నా గుర్రాన్ని కూడా నువ్వు తీసుకో. ఈ ఈటెను తీసుకో. దీనిద్వారా నువ్వు సర్దారులందరికీ సర్దారువనేది అర్థమవుతుంది," అన్నారు.

"మహారాజా! నా సోదరుణ్ణి చంపాక ఏదో అదృశ్య శక్తి నా హృదయంలో ఓ ఆలోచనను రేపింది. ఇకనుంచి ఎవరిని చంపబోయినా నా సోదరుడిలాంటి వాణ్ణి చంపుతున్నాననే భావం నాలో కలుగుతుంది. ఇకనుంచి నేను యుద్ధాలు చెయ్యలేను. ఖడ్గం బలానికి చిహ్నం. బలం సత్యానికి విరోధి. ఇతరుల్ని భయపెట్టాలన్న కాంక్ష నాకు లేదు. ఇతరుల్ని భయపెట్టి విలాసంగా బతికేకన్నా భిక్షమెత్తుకుని బతకడం మంచిదని నేను భావిస్తున్నాను. జీవితం చాలా చిన్నది. మిగిలిన ఈ శేష జీవితాన్ని చెడుకు దూరంగా గడపాలని కోరిక," అంటూ ఎంతో వినయంగా విన్నవించుకున్నాడు విరాట్.

అది విన్న మహారాజు ముఖం కళావిహీనమై, చిన్నబోయింది. రాజుగారి మనసులో విజయోత్సాహం స్థానంలో తెలియని భీతి ఆవహించింది. తన పూర్వీకుల కాలం నుంచి ఇలా ఎప్పుడూ జరగలేదు. ఏ యోధుడూ యుద్ధాన్ని త్యజించలేదు. ఎవ్వరూ మహారాజుగారి బహుమానాన్ని ఇలా తిరస్కరించలేదు. ఏం చెయ్యాలో రాజుగారికి పాలుపోలేదు.

శత్రువుల నుంచి విరాట్ కాపాడి తీసుకువచ్చిన రాజహంసల్ని చూశాడు. విజయ చిహ్నామైన వీటిని చూడగానే రాజుగారి ముఖంలో వెలుగొచ్చింది.

"శత్రువులతో పోరాడడంలో నువ్వు వీరాధివీరుడివని గుర్తించాను. ఇక నుంచి యుద్ధానికి నీ సహాయ సహకారాలు లభించకపోయినా ఫరవాలేదు. నీవంటి నమ్మకస్తులైన ప్రభుభక్తులు రాజ్యంలో ఎవ్వరూ లేరు. నీ సేవలు నాకు కావాలి. నీవు ధర్మబద్ధుడవు. చెడుజోలికి పోవు. చెడును గుర్తించగలవు. చెడును నిర్మూలించగలవు. కాబట్టి ఇకనుంచి నువ్వు న్యాయాధికారులందరిపై ప్రధాన న్యాయాధికారివై నా రాజభవనంలోనే ఉండి న్యాయ నిర్ణయం చేస్తూ ఉండు. నీ నేతృత్వంలో నా రాజ్యంలో సత్యం వెలుగొందుతుంది. ప్రజలు న్యాయబద్ధంగా నడుచుకుంటారు," అన్నారు మహారాజు.

దానికి విరాట్ అంగీకారపూర్వకంగా భక్తితో శిరస్సు వంచాడు. రాజుగారు సంతోషించి విరాట్‌ను రాచ ఏనుగుపై ఎక్కవలసిందిగా ఆదేశించారు. విరాట్‌తో కలసి రాజుగారు తన అరవై స్తంభాల నగరంలోకి ప్రవేశించారు. అప్పుడు తుఫాను సమయాన సముద్ర ఘోషలాగా విజయ నినాదాలు, హర్షధ్వానాలు వినిపించాయి.

ആ ആ ആ

ఆరోజు నుంచి విరాట్ ప్రతిరోజూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా రాజభవనంలోని తన న్యాయపీఠం నుంచి రాజుగారి పేరిట న్యాయ నిర్ణయం చేయసాగాడు. ఆయన తీర్పులు ధర్మకాటాతో తూచినట్లు ఉండేవి. ఏ వైపూ మొగ్గకుండా త్రాసు సమంగా ఉన్నట్లు ఉండేవి. మెరుస్తున్న ఆయన కళ్ళు ముద్దాయి ఆత్మను లోతుగా శోధించేవి. ఆయన వేసే ప్రశ్నలు అపరాధపు మూలాల దాకా చొచ్చుకుపోయేవి. ఆయన విధించే శిక్షలు కఠినంగా ఉండేవి. కానీ ఎప్పుడూ విచారణ రోజే తీర్పు చెప్పేవాడు కాదు. ప్రశాంతంగా ఆలోచించడానికి ఒక రోజు సమయం తీసుకునేవాడు. ఏ విషయంపైన అయినా తీర్పు చెప్పదలుచుకున్న రోజు తెల్లవారు ఝామునే నిద్ర లేచేవాడు. మనసును ప్రశాంతంగా ఉంచుకొని, మేడమీద అటూ ఇటూ పచార్లు చేస్తూ తను చెప్పబోయే తీర్పు అన్నివిధాలా న్యాయబద్ధమైనదా కాదా, సమంజసమైనదా కాదా అని పలు విధాలుగా ఆలోచించేవాడు. ఆయన మేడ మీద నడుస్తూ ఉంటే ఆయన పాద ధ్వని ఇంట్లోని వాళ్ళకు వినిపించేది.

తీర్పు చెప్పే ముందు భావావేశానికి లోను కాకుండా ఉండడం కోసం మరోసారి చేతులు, కాళ్ళు చల్లని నీళ్ళతో కడుక్కునేవాడు. తీర్పు చెప్పాక తన తీర్పు సమంజసంగా ఉందా లేదా చెప్పమని ముద్దాయిని అడిగేవాడు. నూటికో కోటికో ఒక్కరు తప్ప మిగిలిన

వాళ్ళంతా ఆయన తీర్పును శిరసావహించేవారు. న్యాయపీఠం మెట్లను ముద్దుపెట్టుకుని, ఆ తీర్పును దైవ నిర్ణయంగా స్వీకరించేవాళ్ళు.

విరాట్ ఎప్పుడూ, ఎవరికీ మరణశిక్ష విధించలేదు. ముద్దాయి ఎంత క్రూరుడైనా, ఎంత పెద్ద నేరంచేసినా మరణ దండన మాత్రం విధించేవాడు కాదు. తన జీవితాన్ని రక్తసిక్తం చేసుకోవాలంటే భయపడేవాడు.

విరాట్ న్యాయాధికారి కాక పూర్వం ఆ రాజ్యపు వధ్యస్థలిలో ఉన్న బండలన్నీ మరణదండనకు గురైన వ్యక్తుల రక్తంతో నలుపెక్కాయి. విరాట్ న్యాయాధికారి అయ్యాక ఒక్క మరణశిక్షా లేక వర్షాలకు ఆ రక్తపు చారికలు కొట్టుకుపోయి బండలు తెలుపెక్కాయి. మరణశిక్షలు మానేసిన తర్వాత నేరాల సంఖ్య కూడా పెద్దగా పెరగలేదు. నేరస్తుల్ని భూగర్భంలో తొలిచిన కారాగారానికి పంపేవాడు. లేదా కొండలమీదికి పంపి వాళ్ళ చేత తోటల ప్రహరీలకు కావలసిన రాళ్ళను కొట్టించేవాడు. మరికొందరిని నదీ తీరాల్లో ఉన్న బియ్యం మరల్లో ఏనుగుల జతన కట్టి చక్రాలను తిప్పించేవాడు. మానవ జీవితాన్ని ఆయన గౌరవించేవాడు. ఆయన్ని ప్రజలు గౌరవ భావంతో చూసేవారు. ఆయన తీర్పులెప్పుడూ అధర్మంగా లేకపోవడం కూడా దీనికొక కారణం. సత్యాన్వేషణలో ఆయనెప్పుడూ అలిసిపోయేవాడు కాదు. ఆయన పలుకులెప్పుడూ పరుషంగా ఉండేవి కాదు. చాలా దూర ప్రాంతాల నుంచి కూడా రైతులు తమ తగాదాల్ని పరిష్కరించుకోవడానికి విరాట్ దగ్గరకు వచ్చేవాళ్ళు. పూజారులు కూడా ఆయన ఆజ్ఞల్ని శిరసావహించేవారు. మహారాజు సైతం విరాట్ సలహాలు తీసుకునేవారు.

పోనుపోను విరాట్ ఖ్యాతి రాజ్యమంతా వ్యాపించింది. కొద్ది రోజుల్లోనే ఆయన వీరుడు, అసమాన యోధుడు అని తాము పొగిడిన విషయం ప్రజలు మరిచిపోయారు. వాళ్ళ దృష్టిలో ఆయన ఇప్పుడు యోధుడు కాదు, ఉత్తమ న్యాయాధికారి, ధర్మదేవత లాంటి న్యాయమూర్తిగా పేరు పొందాడు.

విరాట్ న్యాయాధికారిగా నియమితుడై ఆరేళ్ళు అయింది. ఒక రోజు కొంతమంది గ్రామీణులు ఒక కొండజాతి యువకుణ్ణి తాళ్ళతో బంధించి విరాట్ ముందుకు లాక్కొచ్చారు. ఈ కొండజాతి వాళ్ళు పర్వతాలకు అవతలివైపున ఉండేవాళ్ళు. వాళ్ళు పూజించే దేవుళ్ళు వేరు. ఈ యువకుడి కాళ్ళు రక్తసిక్తంగా ఉన్నాయి. ఆ గ్రామీణులు ఇతన్ని బంధించి మైళ్ళకు మైళ్ళు నడిపించినట్లున్నారు. అతనిది కండలు తిరిగిన ఒళ్ళు, చాలా బలిష్టంగా ఉన్నాడు. అతని కళ్ళు నిప్పులు కురిపిస్తూ ఉన్నాయి. బలమైన అతని బాహువుల్ని తాళ్ళతో గట్టిగా బిగించి కట్టేశారు. లేకపోతే అతన్ని అదుపులో ఉంచడం వాళ్ళ వల్లకాదు. ఆ యువకుణ్ణి వాళ్ళు న్యాయపీఠం ముందుకు తోసి బలవంతం మీద అతను మోకరిల్లేలా

చేశారు. ఆ తరువాత వాళ్ళు సాష్టాంగ నమస్కారం చేశారు. న్యాయాన్ని అర్థించడానికి వచ్చాం అన్నట్లుగా చేతులు జోడించి నిలబడ్డారు. విరాట్ ఆ అపరిచితుల వంక ప్రశ్నార్థకంగా చూసి "సోదరులారా మీరెవరు? చాలా దూరం నుంచి వచ్చినట్లున్నారు. మీరు బంధించి తెచ్చిన ఈ వ్యక్తి ఎవరు?" అంటూ అడిగాడు.

వచ్చినవాళ్ళలో పెద్దతను ముందుకు వచ్చి చేతులు జోడించి "ప్రభూ! మేం మందలు మేపుకునే వాళ్ళం. ప్రశాంతంగా బతికే తూర్పు ప్రాంత నివాసులం. మేం మీ ముందుకు తెచ్చిన ఈ యువకుడు దుష్టుల్లో కెల్లా మహాదుష్టుడు. మహాపాపి. వేళ్ళమీద లెక్క పెట్టలేనంత మందిని అతను హత్య చేశాడు.

"మా గ్రామంలోని ఒక అమ్మాయిని తనకిచ్చి పెళ్ళి చేయవలసిందిగా కోరాడు. అందుకు ఆ అమ్మాయి తండ్రి అంగీకరించలేదు. దానికి కారణం వీళ్ళ జాతి నీతి నియమాలు, ఆచారాలు. వీళ్ళు గోవుల్ని వధిస్తారు, కుక్క మాంసం తింటారు. అందువల్ల తన కూతుర్ని ఇతనికి ఇవ్వకుండా లోయప్రాంత వ్యాపారి ఒకతనికి ఇచ్చి పెళ్ళి చేశాడు. ఆ కోపంతో ఇతను మా గ్రామ పశువులను ఎన్నింటినో తోలుకుపోయాడు. ఒక రోజు రాత్రి వచ్చి ఆ అమ్మాయి తండ్రిని, ఆయన ముగ్గురు కొడుకుల్ని చంపేశాడు. ఆ రోజు నుంచి ఆ కుటుంబంలో వాళ్ళు గాని, మా గ్రామంలో వాళ్ళు గాని పశువులు మేపుకోవడానికి పర్వత ప్రాంతానికి వెళితే పట్టుకుని చంపేసేవాడు. అలా ఇప్పటికి పదకొండు మందిని చంపేశాడు. చివరకు మేమంతా కలిసి వెంటాడి ఎంతో కష్టపడి ఇతన్ని పట్టుకోగలిగాం. ఎంతో శ్రమకోర్చి మీ సమక్షానికి తెచ్చాం. ఓ ధర్మదాతా! ఈ హంతకుడి బారినుంచి మమ్మల్నీ, మా గ్రామాన్నీ రక్షించండి," అన్నాడు వినయంగా.

విరాట్ తల ఎత్తి ఆ యువకుని వైపు చూశాడు. "వాళ్ళు నీ గురించి చెప్పింది నిజమేనా?" అని ప్రశ్నించాడు.

"ఎవరు నువ్వు? మహారాజువా?"

"నా పేరు విరాట్. రాజుగారికి, న్యాయానికి సేవకుణ్ణి. నా పొరపాట్లకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, సత్యాన్ని అసత్యం నుంచి వేరు చేయాలని నా కోరిక."

ముద్దాయి ఒక్క క్షణం మౌనంగా ఉండి, తరువాత విరాట్ వైపు తీక్షణంగా చూశాడు. "ఎక్కడో దూరంగా న్యాయపీఠం మీద కూర్చుని ఏది నిజమో, ఏది అబద్ధమో నువ్వెలా తెలుసుకుంటావ్? ఇక్కడికి వచ్చినవాళ్ళు చెప్పినదాన్ని బట్టేగా నీకు తెలిసేది?"

"వాళ్ళ ఆరోపణలకు నీ సమాధానమేమిటో చెప్పు. మీరు ఇద్దరూ చెప్పినదాన్ని బట్టి నిజమేదో నేను గ్రహిస్తాను."

ధిక్కార ధోరణిలో ఆ యువకుడు కనుబొమలెగరేశాడు.

"నేనేమి చేశానో నీకెలా తెలుస్తుంది? వీళ్ళతో నాకు విరోధం లేదు. కోపం హద్దులు దాటినప్పుడు నా చేతులు ఏం చేస్తాయో నాకే తెలియదు. కూతుర్ని డబ్బు కోసం అమ్మేసిన ఆ తండ్రి పట్ల, అతని పిల్లల పట్ల, అతని నౌకర్ల పట్ల న్యాయంగానే నేను చెయ్యాల్సింది చేశాను. అది నేరంగా, నన్ను నేరస్తుడిగా వీళ్ళు ఆరోపించదలుచుకుంటే ఆరోపించనీ. వాళ్ళనీ, నీ తీర్పునీ నేను ద్వేషిస్తాను."

ఇంత గొప్ప న్యాయాధికారి సమక్షంలోనే అపరాధి ఎంతో అహంకారంతో ప్రవర్తించడం చూసి ఆ గ్రామీణులు కోపంతో ఊగిపోయారు. బంట్రోతు కొరడా ఝుళిపించాడు. విరాట్ సైగలతో అందరినీ శాంతపరచి, మళ్ళీ ప్రశ్నించాడు.

వాళ్ళు ఒక్కో నేరాన్ని చెప్పినప్పుడల్లా విరాట్ ముద్దాయిని సంజాయిషీ అడిగేవాడు. ముద్దాయి దేనికీ సమాధానం చెప్పకుండా పళ్ళు పటపట కొరికి మౌనం వహించేవాడు. ఒకే ఒక్కసారి మాత్రం అతను నోరు విప్పి "ఇతరుల మాటలు విని నీవెలా న్యాయాన్ని తెలుసుకుంటావ్?" అని ప్రశ్నించాడు.

మిట్ట మధ్యాహ్నానికి నేరం పూర్వాపరాలు వినడం ముగిసింది. విరాట్ న్యాయపీఠం నుంచి లేస్తూ "నేను ఇంటికి వెళుతున్నాను. తీర్పు రేపు చెపుతాను," అన్నాడు.

అందుకు గ్రామీణులు చేతులు జోడించి "ప్రభూ, తమ దయాభిక్ష కోసం ఇక్కడికి రావడానికి ఏడు రోజులు ఎడతెగని ప్రయాణం చేశాం. తిరిగి వెళ్ళడానికి  మరో ఏడు రోజులు పడుతుంది. ఆలన పాలన లేక మా పశువులు అలమటించి పోతుంటాయి. పొలాలు దుక్కులు దున్నుకోవాలి. మా ఎడల దయచేసి తీర్పును రేపటిదాకా వాయిదా వెయ్యకుండా ఈ రోజే చెప్పండి," అని వేడుకున్నారు.

వాళ్ళు చెప్పింది విని ఆలోచిస్తూ విరాట్ కొద్దిసేపు అలా మౌనంగా కూర్చున్నాడు. పెద్ద బరువు నెత్తిన ఎత్తుకున్నవాడిలా కనుబొమలు వాలిపోయి ఉన్నాయి. ఇంత నిర్లక్ష్యంగా, భయం అంటే తెలియని వాడిని, క్షమాభిక్ష కోరని వాడిని శిక్షించాల్సిన అవసరం విరాట్‌కి ఏనాడూ రాలేదు. చాలాసేపు ఆలోచనల్లో మునిగిపోయాడు. సమయం గడిచేకొద్దీ ఆయనకు విచారం ఎక్కువ కాసాగింది.

తన తీర్పు, తన మాటలు ఆవేశంగా ఉండకూడదని లేచి సెలయేటి దగ్గరకు వెళ్ళి చల్లటి నీళ్ళతో ముఖం, కాళ్ళు కడుక్కున్నాడు. ప్రశాంతంగా వచ్చి న్యాయపీఠం మీద కూర్చున్నాడు.

"నా తీర్పు న్యాయసమ్మతంగా ఉండేట్లు భగవంతుడు అనుగ్రహించు గాక!

"పదకొండు మంది మనుషుల ప్రాణాలు తీసిన మహాపాపం ఈ ముద్దాయిని చుట్టుకుంది. తొమ్మిది నెలల పాటు మానవ జీవతం తల్లి గర్భంలో పోషింపబడుతుంది. ఇతను పదకొండు మందిని చంపాడు. ఒక్కొక్కరి కోసం ఒక్కో సంవత్సరం వంతున ఇతను పదకొండు సంవత్సరాలు భూగర్భపు అంధకారంలో ఉండాలి. పదకొండు మందిని హత్యచేశాడు కాబట్టి ప్రతి సంవత్సరం పదకొండుసార్లు ప్రతిసారీ వంద కొరడాదెబ్బలు కొట్టవలసిందిగా శిక్ష విధిస్తున్నాను. దీని ద్వారా ఇతను తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోగలుగుతాడు. కాని, జీవించే హక్కును మాత్రం కోల్పోడు. జీవితం భగవంతుని అనుగ్రహం. దానిపై మానవుడికి అధికారం లేదు. ఇతని అపరాధానికి తగిన విధంగా నేను ప్రకటించిన ఈ తీర్పు న్యాయబద్ధం అయ్యేట్లు భగవంతుడు అనుగ్రహించుగాక," అన్నాడు.

తీర్పు వినగానే గ్రామీణులు న్యాయపీఠం మెట్లను ముద్దుపెట్టుకున్నారు. ముద్దాయి మాత్రం మౌనం వహించాడు.

"చూడు, నీమీద ఆరోపించబడిన నేరాలకు నీ సంజాయషీ ఇచ్చుకోవలసిందిగా కోరాను. నువ్వు పెదవి విప్పలేదు. నీ శిక్షను తగ్గించే అవకాశాన్ని నువ్వివ్వలేదు. ఒకవేళ నా తీర్పులో ఏదైనా దోషం ఉంటే, నీకు అన్యాయం జరిగితే పాపపుణ్యాలు విచారించే ఆ భగవంతుడి ముందు అది నా తప్పు కాదని, నీ మౌనం తాలూక దోషమని చెప్పు. నీ పట్ల నేను కొంత దయ చూపించాను. అదే నాకు సంతోషం."

ముద్దాయి అప్పుడు నోరు విప్పాడు "నీ దయ నాకు అక్కరలేదు. ఒక్క క్షణంలో నా నుంచి నా జీవితాన్ని హరిస్తున్న దానితో పోలిస్తే నువ్వు చూపగలిగే దయ ఏపాటిది?"

"నేను నీ జీవితాన్ని హరించడం లేదు."

"నిజంగానే నువ్వు నా జీవితాన్ని హరిస్తున్నావ్. అడవి మనుషులని పిలిచే మా జాతి వాళ్ళకన్నా నువ్వు నిర్దయగా ప్రవర్తిస్తున్నావు. నేను వాళ్ళను చంపాను. నువ్వూ నన్ను చంపేయ్. కాని నువ్వు నన్ను ఒక్కసారిగా చంపవు. శవప్రాయంగా నన్ను అంధకార భూగృహంలో పాతిపెడతావు. ఏళ్ళకు ఏళ్ళు నేనక్కడ కుళ్ళిపోతూ ఉండాలి. ఎందుకలా చేస్తావు? నీ పిరికి హృదయం రక్తపాతాన్ని తట్టుకోలేదు. అందుకే ఇలాంటి తీర్పులు ఇస్తున్నావు. నీ తీర్పులకు ప్రజలు బలి అవుతున్నారు. నీ చట్టం కూడా మోసం. నేను హత్య చేశాను కాబట్టి నువ్వు కూడా నన్ను హత్య చెయ్," అన్నాడతను ఆవేశంగా.

"నేను నీకు సరైన శిక్షే విధించాను."

"సరైనదా? దేని ప్రకారం సరైనది? ఓ న్యాయమూర్తీ, ఏ ప్రమాణాలతో నువ్వు న్యాయాన్ని నిర్ణయిస్తున్నావో ఆ ప్రమాణాలకు ప్రమాణం ఏమిటి? కొలబద్ద ఏమిటి?

కొరడా దెబ్బల్ని శిక్షగా విధించావు. కొరడా దెబ్బ ఎలా ఉంటుందో నీకు తెలుసా? నువ్వెప్పుడన్నా కొరడా దెబ్బ తిన్నావా?

"వెలుపల వెలుగులో, మారే ప్రపంచంలో మారుతున్న కాలంతోపాటు పదకొండు సంవత్సరాలని వేళ్ళపై లెక్కిస్తూ గడపగలిగినట్టు భూగృహపు చెరసాలలో అంధకారంలో, ఒంటరిగా, ప్రకృతికి, వెలుగుకి దూరంగా, కాలం తెలియకుండా జీవచ్ఛవంలా గడపగలవా? నా జీవితంలో ఎన్ని మధుర వసంతాల్ని హరిస్తున్నావో తెలియడానికి నీవెప్పుడైనా చెరసాల జీవితం గడిపావా? నీవు అజ్ఞానివి. దెబ్బతిన్నవాడే దెబ్బ బాధ ఏమిటో తెలుసుకోగలడు. దెబ్బలు కొట్టేవాడికి, దెబ్బలు తినేవాడి కష్టాలు తెలియవు. బాధలు పడ్డవాడికే బాధ విలువ తెలుస్తుంది.

"అపరాధికి సరైన శిక్ష విధించానని నువ్వు గర్విస్తున్నావు. కాని అపరాధులందరికన్నా నువ్వే పెద్ద అపరాధివి. నేను ఆవేశంలో హత్యలు చేశాను. అప్పుడు నన్ను ఒళ్ళు తెలియని ఆవేశ పిశాచం ఆవహించి ఉంది. కానీ నువ్వో! ప్రశాంతంగా ఉండి నా ప్రాణాల్ని హరిస్తున్నావు. దాని ఫలితాన్ని నువ్వెప్పుడూ అనుభవించలేదు. తలకిందులై పడిపోకముందే నువ్వు న్యాయపీఠం నుంచి దిగిపో! తెలిసినదాన్ని బట్టి నిర్ణయాలు చేసేవాడు పరమ నీచుడు. న్యాయమంటే ఏమిటో తనకు తెలుసనుకునే వ్యక్తి కూడా దుష్టుడే. ఓ అజ్ఞానీ! ఆ న్యాయపీఠం నుంచి దిగు. ఒక్క మాటతో జీవితాల్ని హరించే తీర్పులు చెప్పబోకు," అంటూ దోషి కోపంతో కంపించిపోయాడు.

చుట్టూ ఉన్నవాళ్ళు కోపంతో దోషి మీద విరుచుకు పడబోయారు. విరాట్ వాళ్ళను శాంతింపచేసి, దోషి వైపు నుంచి దృష్టి పక్కకు మళ్ళించి "ఇచ్చిన తీర్పును రద్దుచేసే హక్కు నాకు లేదు. నా నిర్ణయం సరైనదేనని నేను నమ్ముతున్నాను," అని చెప్పి అక్కడి నుంచి వెళ్ళేందుకు లేచి నిలబడ్డాడు. వాళ్ళు ఖైదీని గట్టిగా పట్టుకున్నారు. బంధనాల్లోంచి అతను గుంజుకోసాగాడు.

విరాట్ కొద్ది అడుగులు ముందుకు నడిచి, ఆగాడు. ఆగి అతని వైపు చూశాడు. అతడు క్రోధంతో విరాట్‌వైపు చూస్తున్నాడు. ఆ చూపులకు విరాట్ చలించి పోయాడు. ఆ కళ్ళు సరిగ్గా తన సోదరుడి కళ్ళలాగే ఉన్నాయి. ద్రోహుల శిబిరంలో తన చేత చంపబడ్డ అన్న కళ్ళు ఎలా క్రోధంగా తన వైపు చూశాయో, అలాగే తన చేత శిక్షింపబడిన ఈ ఖైదీ కళ్ళు క్రోధంతో తనను చూస్తున్నాయి. విరాట్ మనసు వికలమైపోయింది.

ఆ రోజు సాయంత్రం విరాట్ ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు. ఆ ఖైదీ చూపులు అగ్ని బాణాల్లాగా విరాట్ హృదయాన్ని దహించివేస్తూ ఉన్నాయి. రాత్రంతా ఆయన

నిద్రపోనేలేదు. తూర్పు దిక్కు ఎర్రబారే దాకా రాత్రంతా మేడ మీద ఆయన పచార్లు చేస్తూనే ఉన్నాడు. ఆయన పాదాల చప్పుడు రాత్రంతా వినిపిస్తూనే ఉంది.

సూర్యోదయం కాగానే, దేవాలయపు కోనేరులో విరాట్ నిత్యకర్మలు ముగించాడు. అనంతరం సూర్యుని వైపు తిరిగి ప్రార్థన చేసి, ఇంటికి వచ్చాడు. ప్రత్యేక సందర్భాల్లో వేసుకునే పసుపు పచ్చని దుస్తులు ధరించాడు. కుటుంబ సభ్యులందరికీ అభివందనాలు తెలియచేశాడు. ఈ కొత్త ఆచారాన్ని చూసి వాళ్ళంతా ఆశ్యర్యపోయారు. కాని ఏమిటిదని అడిగే సాహసం ఎవరికీ లేదు. తరువాత విరాట్ ఒంటరిగా రాజభవనానికి వెళ్ళాడు. రేయింబవళ్ళలో ఎప్పుడైనా రాజభవనంలోకి ప్రవేశించడానికి ఆయనకు అనుమతి ఉంది.

రాజుగారి దగ్గరకు వెళ్ళగానే వినయంగా శిరస్సు వంచి రాజుగారి దుస్తుల్ని తాకాడు. ఆయనేదో కోరుకోబోతున్నాడనడానికి అది గుర్తు. మహారాజుగారు ఆత్మీయంగా విరాట్‌వైపు చూసి "నీవేదో కోరడానికి నా దుస్తుల్ని తాకావు. నువ్వు అడగక ముందే నీ కోరికను నేను అంగీకరిస్తున్నాను," అన్నాడు.

విరాట్ తలవంచుకుని అలా నిలబడే ఉండి "న్యాయాధికారులపై ప్రధాన న్యాయాధికారిగా తమరు నన్ను నియమించారు. ఆరు సంవత్సరాల నుంచి తమరి పేరు మీద నేను న్యాయ నిర్ణయం చేస్తూ వచ్చాను. నేను సరైన న్యాయ నిర్ణయాలు చేశానో లేదో నాకు తెలియదు. సత్య మార్గాన్ని అన్వేషించేందుకు వీలుగా ప్రశాంతంగా విశ్రాంతి తీసుకునేందుకు గాను నాకొక నెల రోజులు సెలవు ఇప్పించండి. మీ నుంచి, ఇతరుల నుంచి నా సొంత అభిప్రాయాలు కాపాడుకునేందుకు అనుమతినివ్వండి. నేను అన్యాయ రహితమైన పనులు చేయాలనుకుంటున్నాను. పాపానికి దూరంగా బతకాలనుకుంటున్నాను," అన్నాడు.

మహారాజు ఆశ్యర్యచకితుడైనాడు.

"ఈనాటి నుంచి నా రాజ్యం న్యాయం లేక అనాథ అవుతుంది. ఏ మార్గాన్ని అనుసరించదలుచుకున్నావు అని కూడా నిన్ను అడగను. ఆ మార్గంలో నీకు సత్యదర్శనం కావాలని మాత్రం కోరుకుంటాను," అన్నాడు.

విరాట్ కృతజ్ఞతతో రాజసింహాసనాన్ని ముద్దాడి తలవంచుకుని వినయంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

విరాట్ ఇంటికి వచ్చి, భార్యా బిడ్డల్ని దగ్గరకు పిలిచి "ఒక నెల రోజులపాటు నేను మీకు కనిపించను. ఎందుకు, ఏమిటి అని నన్ను ప్రశ్నించకుండా నాకు వీడ్కోలివ్వండి. నేను ఇల్లు వదిలి ఎటు వెళుతున్నానో మీకు తెలియకుండా ఉండేందుకు మీరు మీ మీ గదులకు వెళ్ళి తలుపులు వేసుకోండి. ఒక నెల రోజులు గడిచేదాకా నా ఉనికిని తెలుసుకునేందుకు ప్రయత్నించకండి," అన్నాడు.

అంతా మౌనంగా ఆయన చెప్పినట్లు చేశారు.

విరాట్ నల్లని దుస్తులు ధరించాడు. భగవంతుని ప్రార్థించాడు. ఆ తరువాత తాళపత్రాలపై ఒక పెద్ద లేఖ రాశాడు. దానిని తనవద్దనే భద్రపరచుకున్నాడు. చీకటి పడగానే ఇంటి నుంచి బయలుదేరాడు. పెద్ద కొండ దగ్గరకు వెళ్ళాడు, ఆ కొండ అడుగునే చెరసాల ఉంది. అక్కడికి వెళ్ళి తలుపు తట్టాడు విరాట్. చెరసాల అధికారి నిద్ర లేచి "ఎవరూ?" అంటూ వచ్చాడు.

"నేను విరాట్‌ని. ప్రధాన న్యాయాధికారిని, నిన్న పంపిన ఖైదీని కలుసుకోవడానికి వచ్చాను."

"ప్రభూ! ఆ గది ఈ కారాగారంలో అట్టడుగున పాతాళంలో ఉంది. మిమ్మల్ని అక్కడికి తీసుకువెళ్ళమంటారా?" అన్నాడు వినయంగా.

"వద్దు. ఆ స్థలం నాకు తెలుసు. తాళం చెవి నాకివ్వు, నువ్వెళ్ళి నిద్రపో. రేపు ఉదయం నీ ద్వారం చెంత ఈ తాళం చెవి నీకు కనిపిస్తుంది. నువ్విక్కడ నన్ను చూసినట్లు ఎవ్వరితోనూ చెప్పకు."

చెరసాల అధికారి విరాట్‌కు తాళం చెవి, ఒక దీపం తెచ్చి ఇచ్చాడు. విరాట్ సైగ చెయడంతో చెరసాల అధికారి వెళ్ళిపోయాడు. గుహ ద్వారం తెరిచి విరాట్ లోపలికి ప్రవేశించాడు.

ఖైదీలను ఈ కొండ గుహల్లో బంధించడం ఒక శతాబ్దం క్రితం నుంచి ప్రారంభించారు. ఈ బందీలు తర్వాత రాబోయే బందీల కోసం కొత్త గదుల్ని తొలుస్తూ ఉంటారు.

విరాట్ చివరసారిగా ఒక్కసారి ఆకాశం వైపు చూశాడు. మినుకు మినుకుమనే నక్షత్రాలు, తెల్లని మేఘాలు, నిర్మలమైన ఆకాశం కనిపించాయి. విరాట్ ముందుకు నడిచాడు. ద్వారాన్ని మూసివేశాడు. నలువైపులా గాఢాంధకారం. ఆ చీకటిలో దీపం వెలుగు కొద్ది దూరం మాత్రం ప్రసరిస్తోంది. గాలికి చెట్ల కదలికల ధ్వని, కోతుల కిచకిచలు వినిపిస్తూనే ఉన్నాయి. మొదటి గుహ దాటి కిందికి పోగానే చెట్ల కదలికలు, బయటి శబ్దాలు ఎక్కడో

దూర ప్రాంతాల నుంచి వినిపించినట్టుగా కొద్దిగా వినిపించాయి. మరికొంచం కిందికి పోగానే అంతా నిశ్శబ్దంగా, చల్లగా ఉంది. ఇంకొంచం కిందికి పోగానే సముద్రపు అడుగు భాగానికి వెళ్ళినట్లనిపించింది. భయంకరమైన నిశ్శబ్దం. రాళ్ళ నుంచి మాగుడు వాసన. ఇంకా కిందికి వెళుతున్న కొద్దీ ఆ నిశ్శబ్దంలో ఆయన అడుగుల చప్పుడు ఆయనకే కఠోరంగా వినిపిస్తోంది.

ఆ ఖైదీ ఉన్న గది అన్నిటికంటే అడుగున ఉంది. భూమి నుంచి పొడవాటి తాటిచెట్టు కన్నా ఇంకా లోతులో ఉందా గది. ఆ అంధకారంలో విరాట్ దీపం పట్టుకుని ఆ గది దగ్గరకు వెళ్ళాడు. ఆ వెలుగులో గుట్టగా పడి ఉన్న ఒక ఆకారం కనిపించింది. ఈ వెలుగుకు కదిలినట్లనిపించింది. ఆ తరువాత సంకెళ్ళ చప్పుడయింది.

విరాట్ ఆ ఆకారం మీదకు వంగి "నువ్వు నన్ను గుర్తించావా?" అని ప్రశ్నించాడు.

"మరిచిపోతేగా? నిన్నేగా ప్రజలు నా జాతక నిర్ణేతను చేశారు. నా భవిష్యత్‌ను నీ కాళ్ళ కింద నలిపివేశావు కదా? నిన్నెట్లా మరిచిపోతాను."

"నేను ప్రభువునుకాను. మహారాజుకు, న్యాయానికి సేవకుణ్ణి. న్యాయానికి సేవ చేయడం కోసమే నేను ఇక్కడికి వచ్చాను."

ఖైదీ విషాదంగా విరాట్‌వైపే చూస్తూ "నా నుంచి ఏం కోరుకుంటున్నావ్?" అని అడిగాడు.

విరాట్ చాలాసేపు మౌనంగా ఉండి "నా తీర్పు నిన్ను బాధించింది. అలాగే నువ్వు నీ పరుషమైన మాటలతో నా హృదయాన్ని గాయపరిచావు. నా తీర్పు సరైనదో కాదో నాకు తెలియదు. కానీ నీ మాటల్లో కూడా సత్యం ఉంది. తనకు అనుభవం కాని శిక్షను ఇతరులకు విధించకూడదు. ఆ విషయంలో ఇంతవరకు నేను అజ్ఞానినే. నేను విధించే శిక్షలు ఎలాంటివో అనుభవం ద్వారా నేర్చుకోవాలనుకుంటున్నాను. ఈ శిక్షల్లో ఉన్న బాధ ఏమిటో నాకు తెలియకుండా కొన్ని వందల మందికి విధించాను. ఇప్పుడు తెలుసుకోవాలనుకుంటున్నాను. తెలుసుకోగలనని నా ఆశ. దాని ద్వారా నా పాపం నుంచి నేను విముక్తిని పొందుతాను," అన్నాడు.

ఖైదీ ఆశ్చర్యంతో మౌనంగా ఉండిపోయాడు. అతని సంకెళ్ళ ధ్వని తప్ప మరేమీ వినిపించలేదు.

"నిన్ను శిక్షించాలని ఇక్కడికి పంపాను. ఆ శిక్ష ఎలా ఉంటుందో స్వయంగా తెలుసుకోవాలని అనుకుంటున్నాను. కొరడా దెబ్బ ఎంత బాధ కలిగిస్తుందో తెలుసుకోవడం కోసం నేనే స్వయంగా అనుభవించాలనుకుంటున్నాను.

"ఒక నెల రోజులు నీకు బదులుగా నేను ఇక్కడ ఉంటాను. అప్పుడే నా తీర్పుల ద్వారా ఇతరులకు నేనెంత బాధ కలిగించానో అర్థం చేసుకోగలను. ఆ తరువాత నుంచి మాత్రమే మళ్ళీ న్యాయపీఠం ఎక్కి తీర్పులిస్తాను. నా నిర్ణయంలో ఎంత బలముందో నాకప్పుడు అర్థమవుతుంది.

"ఈలోగా నువ్వు స్వేచ్ఛగా బయటకు వెళ్ళు. నీకు తాళం చెవి ఇస్తాను. దాంతో నువ్వు ఈ కారాగారం నుంచి బయటకు వెళ్ళొచ్చు. ఈ గాఢాంధకారంనుంచి బయటపడి వెలుగును చూడొచ్చు. ఒక నెల రోజులు నేను నీకు స్వేచ్ఛనిస్తున్నాను. నెల తరువాత నువ్వు తప్పక తిరిగి వస్తానని నాకు ప్రమాణం చెయ్. నువ్వు వస్తేనే నాకు ఈ పాతాళ అంధకారం నుంచి విముక్తి. నా జీవితానికి వెలుగు వస్తాయి," అన్నాడు విరాట్.

ఖైదీ నిశ్చేష్టుడై శిలాప్రతిమలా నిలబడిపోయాడు. సంకెళ్ళ శబ్దం కూడా అతనికిప్పుడు వినిపించడంలేదు. "ఈ నెల రోజులపాటు మౌనంగా ఉంటానని, ఎలాంటి దుష్కృత్యాలకు పాల్పడనని నాకు మాటివ్వు. భగవంతుడు అన్నీ గమనిస్తూ ఉంటాడని మరిచిపోకు.

"నీకు నా దుస్తులు, తాళం చెవి ఇస్తాను. ఈ తాళం చెవిని చెరసాల అధికారి ద్వారం చెంత వదిలి వెళ్ళు. నువ్వు ఇచ్చిన మాట ప్రకారం నెల రోజులు పూర్తికాగానే ఈ ఉత్తరాన్ని మహారాజుగారికి ఇవ్వు. అప్పుడు నేను బంధ విముక్తుడనవుతాను. అప్పటినుంచి ఇంకా న్యాయబద్ధమైన తీర్పులిస్తాను. నా మాట ప్రకారం నడుచుకుంటానని నువ్వు పూజించే దేవుని పేరిట ప్రమాణం చెయ్యి," అన్నాడు విరాట్.

ఖైదీ ప్రమాణం చేశాడు. ఖైదీ గొంతు పూడుకుపోయి మాట సరిగ్గా పెగల్లేదు. అతనికంతా వింతగా ఉంది.

విరాట్ అతణ్ణి బంధ విముక్తుణ్ణి చేసి, తన దుస్తులు అతనికి ఇచ్చి "ఈ దుస్తులు వేసుకో. నీ దుస్తులు నాకివ్వు. ముఖం కనబడనివ్వకు. చెరసాల అధికారి నిన్ను నేననుకుంటాడు. నన్ను ఎవ్వరూ గుర్తించకుండా ఉండేలా నా గడ్డం, జుట్టు కత్తిరించు."

ఆ ఖైదీ వణుకుతూ, అయిష్టంగా విరాట్ చెప్పినట్టు చేసాడు. మారు మాట్లాడకుండా ఆయన చెప్పినట్టు చేశాక, ఆయన పాదాల మీద పడి, పొగిలి పొగిలి ఏడ్చాడు.

"ప్రభూ! నా బదులుగా మీరు శిక్ష అనుభవించడం నేను భరించలేను. నేను హంతకుణ్ణి. పాపం చేశాను. మీ తీర్పు సమంజసమైందే."

"ఒక్క మాట విను. నువ్వు గాని, నేను గాని నేరాన్ని సరితూచి శిక్షను ఖచ్చితంగా నిర్ణయించలేం. ఈ విషయంలో త్వరలోనే నాకు జ్ఞానోదయమవుతుంది. వెళ్ళు, నువ్వు చేసిన ప్రమాణాన్ని నెరవేర్చు. వచ్చే పౌర్ణమి రోజున ఈ ఉత్తరాన్ని రాజుగారికి అందించు.

ఆయన నన్ను బంధ విముక్తుణ్ణి చేస్తాడు. ఈలోగా నా నిర్ణయాల్లో న్యాయాన్యాయాలను నేను గుర్తించగలుగుతాను. అప్పటినుంచి నా తీర్పులు న్యాయానికి దూరం కావు. ఇక నువ్వు బయలుదేరు.”

ఖైదీ మోకరిల్లి భూమిని ముద్దాడి బయలుదేరాడు. తరువాత తలుపు మూసిన చప్పుడైంది. సొరంగం గుండా దీపం వెలుగు మరొకసారి గోడలపై పడింది. మిగిలిన రాత్రి గాఢ నిశ్శబ్దంలో లీనమైపోయింది.

మరునాటి ఉదయం బహిరంగంగా విరాట్‌ను వంద కొరడా దెబ్బలు కొట్టారు. ఆయననెవరూ గుర్తించలేదు. ఆచ్ఛాదనలేని వీపు మీద మొదటి కొరడా దెబ్బ పడినప్పుడు మాత్రం బాధతో అరిచాడు. తరువాతి దెబ్బల్ని పళ్ళ బిగువున భరించాడు. డెబ్బయ్యవ కొరడా దెబ్బ పడే సమయానికి స్పృహ తప్పి పడిపోయాడు. వంద దెబ్బలూ ముగిశాక చచ్చిన జంతువును ఈడ్చుకుపోయినట్టు విరాట్‌ను అక్కడి నుంచి తీసుకువెళ్ళి అతని గదిలో పడేశారు.

విరాట్‌కి స్పృహ వచ్చేసరికి చెరసాల గదిలో పడి ఉన్నాడు. ఎర్రటి నిప్పు కణికలపై పడుకున్నట్లుగా అనిపించిందతనికి. ఫాలభాగం చల్లగా ఉంది. మూలికల వాసన వచ్చింది. కళ్ళు కొంచం తెరచి చూశాడు. చెరసాల అధికారి భార్య అతని పక్కన ఉంది. ముఖంమీద నీళ్ళు చిలకరిస్తోంది. ఆమె కళ్ళల్లో తొణకిసలాడుతున్న జాలిని, దయను గమనించాడు. శారీరకంగా బాధను అనుభవిస్తున్న ఆ క్షణంలో కూడా, ఎదుటి మనిషిలో కరుణను కలిగించడంలోనే కష్టానికి సాఫల్యం ఉందని విరాట్ గమనించాడు. ఆమె వైపు చూసి చిరునవ్వు నవ్వాడు. తన బాధ మరచిపోయాడు.

రెండవ రోజుకి తనంతట తాను లేవగలిగి, నడవగలిగిన ఓపిక వచ్చింది. ఒక్కో అడుగు వేస్తుంటే ప్రతి అడుగు కింద ఒక నూతన ప్రపంచ నిర్మాణం జరుగుతున్నట్లుగా అనిపించింది. మూడవ రోజుకు గాయాలు కొద్దిగా నొప్పి తగ్గాయి. శారీరకంగానూ, మానసికంగాను కాస్త పుంజుకున్నాడు.

తరువాత తరువాత పెద్దగా కదలకుండా మౌనంగా కూర్చునేవాడు. రాతి పైకప్పు నుంచి పడే నీటి బొట్లు ఆధారంగా గడుస్తున్న కాలాన్ని లెక్కించేవాడు.

ఒక మహా నిశ్శబ్దం అసంఖ్యాక క్షణాలుగా, లిప్తలుగా విడిపోతుంది. అవన్నీ కలిపి రాత్రీ పగలుగా అవతరిస్తాయి. మనిషి జీవితమూ అంతే! వేలాది రాత్రీ పగళ్ళతో జీవితం గడిచిపోతుంది. వృద్ధాప్యం వచ్చేస్తుంది.

విరాట్‌తో మాట్లాడడానికి ఎవరూ రాలేదు. చుట్టూ ఉన్న గాఢాంధకారం ఆత్మను కూడ ఆవరించినట్లయింది. అయినా ఆయనలో అనేక జ్ఞాపకాల సెలయేళ్ళు

ప్రవహించడం మొదలయింది. ఆ సెలయేళ్ళ నిర్మల జలంతో నిండిన గతస్మృతుల సరోవరంలో అతని జీవితం అంతా ప్రతిబింబించింది. జీవితసారం అవగతమైంది. శకలాలు, శకలాలుగా అనుభవంలోకి వచ్చిన జీవిత సత్యాలు అన్నీ ఏకమై ఒక్కసారిగా సాక్షాత్కరించినట్లయింది. ఈ గాఢాంధకారంలో, ఒంటరిగా అలౌకికమైన స్థితిలో రాగద్వేషాలు, మమతానురాగాలు, నా అనే భావనకు దూరంగా సమాజాన్ని గురించి ఆలోచించినప్పుడు ఎప్పుడూ లేనంతగా నిర్మలమైపోయింది విరాట్ మనసు.

రోజురోజుకూ జీవితం పట్ల ఆయన దృక్పథం స్పష్టం కాజొచ్చింది. ఆ అంధకారంలోనే అనేక విషయాలు స్పష్టమైన రూపు తొడగసాగాయి. ఆయన ఆత్మదృష్టి ముందు వాటి అసలు రూపాలు ఆవిష్కృతమవసాగాయి. ఆత్మావలోకనంతో ఆయనకు చాలా ఆనందం కలిగింది.

ఆ అంధకారంలో, ఏకాంతంలో తనను తాను మరిచిపోయి, వివిధ రూపాల్లో విశ్వమంతా వ్యాపించి ఉన్న పరామాత్మ విశ్వరూపాన్ని లోతుగా అర్థం చేసుకోసాగాడు.

రోజు రోజుకు విరాట్ దృష్టి మరింత స్పష్టమవుతోంది. ఆ అంధకారంలోనే అన్ని విషయాలూ వాటంతట అవే కొత్త రూపాలు ధరించి విరాట్ జ్ఞాన దృష్టికి దర్శనం ఇస్తున్నాయి. ఆయన అంతరంగంలోని అన్ని విషయాలూ మరింత స్పష్టం కాజొచ్చాయి. ఆత్మావలోకనంతో ఆయనకి చాలా ఆనందం కలిగింది. చీకటిలో, తన స్వభావానికి తెలియని ఒంటరితనంలో మానవ సంబంధాలకు దూరంగా ఉండడంతో అనంత రూపాలు కలిగిన దివ్యత్వం శక్తి ఏమిటో ఆయన మరింత బాగా తెలుసుకోగలిగాడు. ఊహాకల్పిత నిర్మాణాల మధ్య ఆయన స్వేచ్ఛగా, స్వతంత్రంగా విహరించగలుగుతున్నాడు. అయితే కొత్త చిగుళ్ళు వేయలేని మోడులాగా గంటలకు గంటలు తాను గాఢాంధకారంలోకి, భూగర్భంలోని నల్లటి రాతి పొరల్లోకి కూరుకుపోతున్నట్టు ఆయనకు అనిపించింది.

విరాట్ ఇలా పద్దెనిమిది రోజులు తన ఇచ్ఛా ప్రపంచం నుంచి విడివడి, ఆత్మావలోకనపు అలౌకికానందంలో మునకలు వేశాడు. తన తప్పిదాలకు ప్రాయశ్చిత్తంగా తాను చేపట్టిన ఖైదీ జీవితం ఆయనకు ఆనందదాయకంగా అనిపించింది. దివ్యజ్ఞానానికి సంబంధించిన శాశ్వత చైతన్యం ముందు పాపాలు, పరిహారాలు వంటివి ఊహా కల్పితాలు, స్వాప్నిక దృశ్యాలూ అనిపించింది.

కాని పందొమ్మిదవ రోజు రాత్రి వచ్చిన ఒక ఆలోచనతో, అంకుశం పోటుతో విలవిలలాడుతూ నిద్ర నుంచి మేల్కొన్నాడు, ఆయన దేహం భయంతో వణికిపోయింది, వాయు ప్రభంజనంలో కొట్టుకునే ఆకుల్లాగా చేతి వేళ్ళు వణికిపోయాయి. ఆయనను

అంతగా వణికించిన ఆ ఆలోచన ఏమంటే – ఒకవేళ ఆ ఖైదీ తనను మోసం చేసి నెల తరువాత తిరిగి రాకపోతే? ప్రమాణాలకు కట్టుబడకపోతే? అసలు తనను మరచిపోతే? తన శరీరంలో రక్తమాంసాలు ఉడిగిపోయే వరకు ఇక్కడే, ఈ కారాగారంలోనే సంవత్సరాల తరబడి ఉండిపోవాల్సి వస్తుందేమో!

ఈ ఆలోచన కలగడంతో ఆయనలో బతకాలన్న కోరిక నాగుపాములాగ పడగవిప్పి, అప్పటిదాకా తనను కమ్మిన పొరలన్నింటినీ బద్దలు చేసుకుని బయటకు వచ్చింది. కాలానికి సంబంధించిన చైతన్య ప్రవాహం ఆయన ఆత్మలో ప్రవేశించడం ప్రారంభమయింది. దానితోపాటే భయాలు, ఆశలు. ఐహిక ప్రపంచానికి సంబంధించిన అన్ని లౌకిక విషయాలూ ఆయన ఆత్మను ఆవహించుకోనారంభించాయి. అనంతరూపాల్లో వ్యాప్తమై ఉన్న భగవంతునిపై కూడా దృష్టిని నిలపలేకపోతున్నాడు. తన గురించి మాత్రమే ఆలోచించ గలుగుతున్నాడు. ఆయన కళ్ళు వెలుగు కోసం, సూర్యోదయం కోసం తపించిపోతున్నాయి. ఆ చీకటి గుహలో కుచించుకుపోయి ఉన్న ఆయన శరీరానికి ఇప్పుడు పరుగెత్తాలని, గంతులు వేయాలని అనిపిస్తోంది. తన భార్య, పిల్లలు, తన ఇల్లు, ఆస్తులు, ఇంకా అనుభవించి ఆనందించవలసిన ప్రాపంచిక ఆకర్షణలకు సంబంధించిన ఆలోచనలతో ఆయన మనసు నిండిపోయింది.

నిశ్చలంగా ఉన్న చెరువు నీటిలోకి మురికి నీళ్ళు ప్రవేశించినట్టు, జీవితాంతం చెరసాలలోనే మగ్గాల్సి వస్తుందేమో అన్న ఆలోచన ప్రశాంతంగా గడిచిపోతున్న కాలాన్ని క్షణమొక యుగంలా గడిచేలా చేసింది. చెరసాల పైకప్పు నుంచి పడుతున్న నీటి బిందువులు ఇప్పుడు చాలా ఆలస్యంగా, భారంగా పడుతున్నట్టు అనిపించసాగాయి.

ఆయన ఆ గుహలో ధైర్యంగా ఉండలేకపోతున్నాడు. ఆ కొండజాతి మనిషి తనను మరచిపోయి, తాను శాశ్వతంగా ఇక్కడే, ఈ భయంకర నిశ్శబ్దంలోనే ఉండిపోవలసి వస్తుందేమోననే ఆలోచన ఆయనలో అశాంతిని రేపింది. పంజరంలో పక్షిలాగా ఆ చిన్న గదిలో అటూ ఇటూ వెర్రిగా తిరిగేవాడు. ఎటూ కదలలేనితనం ఆయనను తీవ్రంగా బాధించేది. ఆ గుహ గోడల్ని తిట్టేవాడు. శపించేవాడు. తనను తాను తిట్టుకునేవాడు. దేవుళ్ళని, మహారాజుని దూషించేవాడు. రక్తం కారుతున్న వేళ్ళతో బండరాళ్ళను బద్దలుకొట్టే ప్రయత్నం చేసేవాడు. తలవంచి పరుగున వెళ్ళి చెరసాల ద్వారానికి తలతో ఢీకొట్టేవాడు. స్పృహ లేకుండా పడిపోయేదాకా అలా మోదుతూనే ఉండేవాడు. మళ్ళీ స్పృహ రాగానే లేచి నిలబడి మళ్ళీ అదేపని చేసేవాడు. అలా ఎన్నిసార్లు చేశాడో లెక్కలేదు.

పందొమ్మిదవ రోజు నుంచి పౌర్ణమి వచ్చేదాకా విరాట్ జీవితం భయంకరంగా గడిచింది. ఆహార పానీయాలను సరిగ్గా తీసుకోలేకపోయాడు. ఆయన దేహం ఉద్వేగంతో

దహించుకుపోయింది. నీటి బిందువు జారి పడినప్పుడల్లా కాలాన్ని లెక్కించేవాడు. ఆయన దృష్టంతా ఈ రోజు గడిచి మరో రోజు రావడం మీదనే. ఈ ధ్యాసలో పడి కనుబొమ్మలపై వెంట్రుకలు తెల్లబడడం లాంటి విషయాల్ని ఆయన గమనించలేదు.

ꙮ ꙮ ꙮ

పౌర్ణమి రోజున బయటనుంచి పెద్ద శబ్దాలు వినిపించి, కొద్ది సేపటికి సద్దుమణిగాయి. ఆ తరువాత మెట్ల మీద అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో వచ్చి తలుపు తెరిచారు. గదిలోకి కొద్దిగా వెలుగు వచ్చింది. విరాట్ లేచి చూశాడు. ఆయన ముందు మహారాజు గారు నిలబడి ఉన్నారు. రాజుగారు విరాట్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.

"మీరు చేసిన పని నాకు తెలిసింది. మా పూర్వీకుల కాలం నాటి చరిత్రలో పేర్కొన్న గొప్ప విషయాలకంటే మీరు చేసిన ఈ పని మహత్తరమైంది. ఈ మహత్కార్యం మా జీవితాల్లో ఒక ధృవతారగా వెలుగుచూపుతుంది.

"బయటకు రండి, సూర్యభగవానుడు మిమ్మల్ని తేజోమయుణ్ణి చేస్తాడు. మహోన్నతులైన మిమ్మల్ని దర్శించుకోవడానికి ప్రజలు బయట ఆనందోత్సాహాలతో ఎదురు చూస్తున్నారు," అన్నాడు మహారాజు.

మహారాజుతో కలిసి ముందుకు నడిచాడు విరాట్. నెల రోజుల నుంచి వెలుతురు ముఖం చూడనందువల్ల ఒక్కసారిగా సూర్యకాంతి ముఖం మీద పడేసరికి తట్టుకోలేక పోయాడు. కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకున్నాడు. సరిగ్గా నడవలేకపోయాడు. తాగిన వాడిలాగా తూలుతూ నడిచాడు. నౌకర్లు ఆసరా ఇచ్చారు. ప్రజల ముందుకు పోకముందే విరాట్ రాజుతో "మహారాజా! మీరు నన్ను గొప్ప న్యాయమూర్తి అన్నారు. కాని, ఒకరి జీవితంలో మంచి చెడ్డల్ని మరొకరు బేరీజు వేయడం, ఇతరుల గురించి న్యాయ నిర్ణయం చేయడం అన్యాయమని, భయంకరమైన పొరపాటని నాకిప్పుడు అర్థమయింది. నా తీర్పుల వల్ల అనేక మంది దురదృష్టవంతులు ఇంకా ఈ పాతాళ గృహంలో మగ్గుతున్నారు. వాళ్ళెంత బాధలు పడుతున్నారో మొదటిసారిగా నేనిప్పుడు గ్రహించాను. ప్రతీకార ధోరణిలో శిక్షలు అమలుచేసే ఈ చట్టాలే దుర్మార్గమైనవని నేనిప్పుడు గ్రహించాను. ఈ ఖైదీలను విడిచిపెట్టండి. ఆ ప్రజల్ని వెళ్ళిపొమ్మని చెప్పండి. నన్ను కీర్తిస్తూ వాళ్ళు చేసే జయజయ ధ్వానాలు నన్ను సిగ్గుపడేలా చేస్తున్నాయి. దోషినైన నన్ను వాళ్ళు కీర్తించడం చాలా బాధాకరంగా ఉంది," అన్నాడు.

మహారాజుగారు సైగ చేయడంతో సేవకులు ప్రజల్ని దూరంగా పంపేశారు. మళ్ళీ అంతా నిశ్శబ్దం. అప్పుడు మహారాజుగారు విరాట్‌నుద్దేశించి "ఇంతవరకూ నువ్వు అధిష్టించిన న్యాయపీఠం రాజప్రసాదపు మెట్లచెంత ఉంది. కాని బాధల అనుభవంతో, సత్యాన్వేషణలో పొందిన జ్ఞానంతో పూర్వంకన్నా నువ్విప్పుడు గొప్ప న్యాయమూర్తివి. కాబట్టి ఇకనుంచి నీ స్థానం నా సింహాసనం పక్కనే. నీ చెంత కూర్చున్నందువల్ల నీ మాటలు విని, నీ తీర్పులు గమనించి మరింత జ్ఞానం పొందుతాను," అన్నారు.

మహారాజుగారిని ఏదో అభ్యర్థించబోతున్నందుకు గుర్తుగా రాజుగారి మోకాళ్ళను తాకాడు విరాట్.

"మహారాజా, దయచేసి ఆ ప్రధాన న్యాయాధికారి పదవి నుంచి నాకు విముక్తి ప్రసాదించండి. ఒకళ్ళ గురించి న్యాయ నిర్ణయం చేసే అధికారం మరొకరికి లేదని తెలుసుకున్న తర్వాత ఇక తీర్పులు చెప్పలేను. శిక్షించే అధికారం భగవంతుడిదే కాని మనుషులది కాదు. విధి చేయాల్సిన పనిలో జోక్యం చేసుకునే వాళ్ళెవరైనా నేరం చేస్తున్నట్టే. ఈ పాపాలకు దూరంగా నా జీవితాన్ని గడపాలనుకుంటున్నాను," అన్నాడు.

"సరే అలాగే చేద్దాం. ప్రధాన న్యాయాధికారి బదులుగా నాకు ప్రధాన సలహాదారుగా ఉండు. యుద్ధం, శాంతి భద్రతలు, పన్నులు మొదలైన విషయాల్లో సలహాలివ్వు. నీ తెలివి తేటలతో, జ్ఞానంతో నాకు మార్గ నిర్దేశం చెయ్యి."

విరాట్ మళ్ళీ మహారాజుగారి మోకాళ్ళను తాకాడు "దయచేసి మళ్ళీ నాకు అధికారం ఇవ్వొద్దు. అధికారం క్రియను కోరుతుంది. క్రియ న్యాయమైందేనా? విధి నిర్ణయించినదాన్ని ఏ క్రియ ఎదుర్కొంటుంది? నేను యుద్ధ మంత్రాంగం చేయడమంటే మృత్యుబీజాలను నాటడమే. నేను ఏది పలికితే అది కార్యరూపం దాలుస్తుంది. నేను చేసే ప్రతి పనికి ఒక ప్రాముఖ్యం ఉంటుంది. దాని పరిణామం ఏమిటో నాకే తెలియకపోవచ్చు. అన్ని కర్మల నుంచి విముక్తుడై, ఒంటరిగా ఉండేవాడే న్యాయబద్ధంగాను, జ్ఞానిగాను ఉండగలడు.

"ఈ ఏకాంత వాసంలో ఒంటరిగా ఉన్నప్పుడే పాపాలకు దూరంగాను, జ్ఞానానికి చేరువగాను ఉన్నాను. నేను ఆనందంగా, నా ఇంట్లోనే ఉండిపోయేందుకు అనుమతినివ్వండి. భగవంతుడికి సేవలు చేయడం తప్ప ఇతరులకు సేవలు చెయ్యాల్సిన అవసరం లేకుండా, పాపవిముక్తుడిగా బతకనివ్వండి," అన్నాడు వినయంగా.

"మీ సేవలను వదులుకోవడం నాకు బాధాకరమే. కాని జ్ఞానులతో వాదించే సాహసం ఎవరు చేస్తారు? ఉన్నత వ్యక్తుల అభీష్టాలకు విరుద్ధంగా ఎవరేం చెయ్యగలరు? మీ ఇష్టప్రకారం బతకడం అత్యుత్తమం. మీవంటి పాపవిముక్తుడైన ఒక వ్యక్తి నా రాజ్యంలో ఉంటున్నాడనే విషయమే నాకు గర్వకారణం," అన్నారు మహారాజు.

కారాగార ముఖద్వారం వద్ద వాళ్ళిద్దరూ సెలవు తీసుకున్నారు. సూర్యకాంతి సోకిన గాలి పరిమళాన్ని ఆస్వాదిస్తూ విరాట్ ఒంటరిగా ఇంటివైపు నడిచాడు. అన్ని బాధ్యతల నుంచి విముక్తుడు కావడంతో మనసు ఎప్పుడూ లేనంత తేలికగా ఉంది. తను నడుస్తూ ఉంటే వెనక ఎవరిదో పాదాల చప్పుడు వినిపించింది. వెనుదిరిగి చూశాడు. ఆ కొండజాతి యువకుడే. అతని శిక్షే తను అనుభవించింది. ఆ యువకుడు విరాట్ పాదముద్రలు పడినచోట భూమిని ముద్దుపెట్టుకుని, భయం భయంగా వచ్చిన దారినే తిరిగి వెళ్ళిపోయాడు. విరాట్ చిరునవ్వు నవ్వాడు. చనిపోయిన తన సోదరుడి కళ్ళను చూసినప్పటి నుంచి విరాట్ నవ్వడం ఇదే మొదటిసారి. ప్రసన్న హృదయంతో ఇంట్లోకి ప్రవేశించాడు.

ఇంటికి తిరిగి వచ్చినప్పటి నుంచి విరాట్ జీవితం సంతోషంగా గడిచిపోతూ ఉంది. ఎప్పుడూ భగవధ్యానంలో గడిపేవాడు. "ఓ భగవంతుడా! నాకు స్వర్గ ఛాయలను కాక స్వర్గపు వెలుగును ప్రసాదించు. నాకీ ప్రపంచంలోని సమస్త ఆనందకర విషయాలను చూపించు. ప్రకృతి తాలూకు మధురమైన అనుభవాల్ని, మధుర జీవన సంగీతాన్ని వినిపించు," అని ప్రార్థించేవాడు.

పవిత్ర ప్రేమతో తన శరీరాన్ని తానే తడుముకునేవాడు. తన భార్య మృదువైన దేహాన్ని, తన పిల్లల బలిష్ఠమైన చేతుల్ని నిమిరేవాడు. భగవంతుని ప్రతి రూపం ఆయనకు అందరిలో కనిపించేది.

తన హద్దులు దాటి ఇతరుల వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం రానందుకు ఎంతో ఆనందించేవాడు. ఉదయం నుంచి సాయంత్రం దాకా విజ్ఞాన గ్రంథాల్ని పఠించేవాడు. ధ్యానం, ఆత్మతో ఐక్యం కావడం, దీనుల పట్ల దయ, త్యాగదీక్ష మొదలైన పలురకాల భక్తి మార్గాల్ని ఆచరించేవాడు. ఎప్పుడూ ప్రసన్నంగా ఉండేవాడు. నౌకర్లతో కూడా చాలా సౌమ్యంగా, ఆత్మీయంగా మాట్లాడేవాడు. కుటుంబ సభ్యులు, పనివాళ్ళంతా విరాట్‌తో అంతకు ముందుకన్నా ఎక్కువ వినయంగా ఉండసాగారు. కష్టాల్లో ఉన్నవాళ్ళకి ఆయన సాయపడి ఆదుకునేవాడు. బాధల్లో ఉన్న వాళ్ళని ఓదార్చేవాడు. ప్రజలు కూడా ఆయన శుభాన్ని కోరుకునేవాళ్ళు.

ఇప్పుడాయన్ను ఎవరూ మహా యోధుడని అనుకోవడంలేదు. గొప్ప న్యాయమూర్తి అని భావించడం లేదు. ఇప్పుడాయన అందరికీ ఉత్తమ సలహాదారు. ఇరుగు పొరుగు వాళ్ళే కాకుండా ఇతరులు ఎంతో మంది ఆయన సలహా కోసం వచ్చేవాళ్ళు. ఆ రాజ్యపు

న్యాయాధికారి కాకపోయినా అపరిచితులెందరో తమ మధ్య వివాదాల్ని పరిష్కరించు కోవడానికి ఆయన దగ్గరకు వచ్చేవాళ్ళు. నిస్సంకోచంగా ఆయన సలహాలను పాటించేవాళ్ళు. ఇలా చేయడం ఆయనకి సంతృప్తికరంగా ఉంది. ఆదేశించడం కన్నా సలహాలివ్వడం – తీర్పు చెప్పడం, శిక్షలు వేయడం కన్నా సమస్యను సామరస్యంగా పరిష్కరించడం, రాజీ చేయడం చాలా గొప్పవని ఆయన ఉద్దేశం. పైగా ఇప్పుడు ఒకరి జీవితం మీద పెత్తనం చెయ్యడంగాని, అనేక మంది అదృష్ట దురదృష్టాలను, సుఖదు:ఖాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడంగాని ఆయన పని కాదు. జీవితంలోని అమూల్య క్షణాలను ఈ విధంగా సంతోషంగా గడుపుతున్నాడు.

అలా కొన్ని సంవత్సరాలు ఆనందంగా గడిచాయి. ఏ ఒడుదుడుకులు లేకుండా సంతోషంగా గడపడం వల్ల చాలా త్వరగా కాలం గడిచినట్టు అనిపించింది.

జీవిత సంకుచితత్వాల నుంచి పూర్తిగా బయటపడ్డాడు విరాట్. కొందరు తగాదా పడి తీర్పుకోసం వచ్చినప్పుడు ఆయన ఆశ్చర్యపోతుంటాడు. జీవనావకాశాలు ఈ ప్రపంచంలో ఇంత విస్తృతంగా ఉండగా, మనుషుల మధ్య ఇన్ని ఘర్షణలెందుకో! అధికారం, పెత్తనం కోసం మనుషులు ఈర్ష్యలతో ఒకర్నొకరు ఎందుకు హతమార్చు కుంటున్నారో ఆయనకు అంతుపట్టేది కాదు. ఆయనకు ఇతరుల పట్లగాని, ఇతరులకు ఆయన పట్ల గాని ఈర్ష్యలేదు. ఆయన నివాసం జీవిత సాగరం మధ్యన ఒక ప్రశాంతమైన దీవిలాగా ఉంది. కోర్కెల అలలుకానీ, తృష్ణ ప్రవాహాలు కానీ దానిని తాకడం లేదు.

ఆరు సంవత్సరాలు అలా ప్రశాంతంగా గడిచాక ఒక రోజు సాయంత్రం ఆయన పడుకుని ఉన్నప్పుడు పెద్దగా అరుపులు, కొరడా దెబ్బల శబ్దం, ఒక మనిషి ఆక్రందన వినిపించాయి. విరాట్ లేచి చూశాడు. తన కుమారుడు ఒక బానిసను కొరడాతో కొడుతున్నాడు. బానిసను బలవంతంగా మోకాళ్ళమీద కూర్చోబెట్టి కొరడాతో కొడుతుంటే ఆ దెబ్బలకు బానిస శరీరం రక్తం చిమ్ముతోంది. ఆ బానిస విరాట్ వైపు చూశాడు. తను హత్య చేసిన తన సోదరుడి కళ్ళు తనను చూస్తున్నట్టు అనిపించింది. త్వరగా ముందుకు వచ్చి కొరడాతో కొట్టబోతున్న కొడుకు చేతిని పట్టుకుని ఆపాడు. ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించాడు.

వాళ్ళు చెప్పినదాన్ని బట్టి విరాట్‌కి అర్థం అయింది ఏమిటంటే ఈ బానిస రోజూ కొండ చెలమ నుంచి కొయ్యబకెట్ల కావిడితో నీళ్ళు మోసుకొచ్చి, ఇంట్లో నీళ్ళతొట్లు

నింపాలి. రోజంతా అదే పని అతనికి. అయితే మిట్ట మధ్యాహ్నం వేళ వడదెబ్బకు తట్టుకోలేక, అలిసిపోయి చాలా ఆలస్యంగా నీళ్ళకావిడి మోసుకొచ్చేవాడు. అట్లా ఆలస్యంగా వచ్చినప్పుడల్లా అతన్ని దండించేవాళ్ళు. అయితే నిన్న ఆలస్యంగా వచ్చాడని విపరీతంగా కొట్టడం వల్ల అతను ఇంటి నుంచి పారిపోయాడు. పారిపోయిన విషయం తెలుసుకున్న విరాట్ కొడుకులు గుర్రాలమీద వెంటాడి నది దగ్గర అతన్ని పట్టుకోగలిగారు. ఆ బానిసను తాళ్ళతో కట్టేసి ఆ తాడుని ఒక గుర్రపు జీనుకు కట్టి ఈడ్చుకు వచ్చారు. అతని కాళ్ళంతా రక్తం కారుతున్నాయి. ఈ బానిస మళ్ళీ పారిపోయే ప్రయత్నం చెయ్యకుండా, ఈ బానిసను చూసి మిగిలిన బానిసలు అలాంటి పని చేయకుండా అందరకీ భీతిగొలిపేలాగా కఠినంగా అతన్ని శిక్షిస్తున్నారు.

విరాట్ ఆ బానిస వంక చూశాడు. బలిపశువు కసాయివాడి వైపు దీనంగా చూసినట్టు ఉందా చూపు. తను ఒకప్పుడు ఎదుర్కొన్న భయానక పరిస్థితే అది.

"ఆ మనిషిని వదిలేయండి. శిక్షించింది చాలు," అన్నాడు కొడుకులతో.

ఆ బానిస విరాట్ ముందుకొచ్చి అతని పాదాల దగ్గర భూమిని ముద్దు పెట్టుకున్నాడు.

జీవితంలో మొదటిసారిగా తండ్రి మీద కోపంతో విరాట్ కొడుకులు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. విరాట్ కూడా తన గదికి వచ్చేశాడు. చల్లని నీళ్ళతో ముఖం, కాళ్ళు కడుక్కున్నాడు. చల్లటి నీటి స్పర్శ తగలగానే తానేమి చేస్తున్నదీ అకస్మాత్తుగా బోధపడింది విరాట్‌కు. చెరసాల నుంచి విడుదలయిన తర్వాత మొట్టమొదటిసారి ఇతరుల విషయంలో జోక్యం చేసుకుని తీర్పు ఇచ్చాడు. ఆ రాత్రి విరాట్‌కు నిద్రపట్టలేదు. ఈ ఆరు సంవత్సరాల్లో ఆయనకు నిద్ర దూరమైన రాత్రి అదే. ఆ చీకట్లో ఆయన అలా కళ్ళు తెరిచి పడుకుని శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తూనే ఉన్నాడు. ఆ చీకటిలోనే విరాట్‌కు బానిస బెదురు చూపులు, తన చేతిలో చనిపోయిన అన్న క్రోధపు చూపులు, కొడుకుల ద్వేషపు చూపులు కళ్ళముందు కనిపించాయి.

తన కొడుకులు ఆ బానిస పట్ల అంత అన్యాయంగా ఎట్లా ప్రవర్తించగలిగారని పదే పదే తనను తాను ప్రశ్నించుకున్నాడు. పనిని నిర్లక్ష్యం చేశాడనే నెపంతో బానిస రక్తం చిందించి ఇంటిని అపవిత్రం చేశారు. చిన్న పొరపాటు చేసినందుకు సాటి వ్యక్తిని అంత క్రూరంగా ఎలా కొట్టగలిగారు? తన ఇంట్లో జరిగిన ఈ తప్పుకి కొరడా దెబ్బలు తిన్నదానికన్నా ఎక్కువ బాధ కలిగింది విరాట్‌కు.

ఆ రోజు సాయంత్రం జరిగిన సంఘటనలో శిక్షింపబడింది ఉన్నత వంశస్తుడు కాదు, ఒక బానిస. రాజ శాసనం ప్రకారం పుట్టుక నుంచి ఎవరో ఒక యజమాని అధీనంలో ఉండే జీవమున్న శరీరం పేరే బానిస. మనుషులంతా భగవంతుని

ప్రతిరూపాలయితే, కొందరు మనుషుల్ని బానిసల్ని చేసే రాజశాసనం భగవంతుని దృష్టిలో న్యాయసమ్మతమేనా? ఒక బానిసని హింసించినవాడు, అతని జీవితాన్ని నాశనం చేసినవాడు భగవంతుని ముందు నిర్దోషి కాగలడా?

దీన్ని గురించి రుషులు ఏమైనా చెప్పారేమో చూద్దామని పక్కమీద నుంచి లేచి దీపం వెలిగించాడు. తాళపత్ర గ్రంథాలు ముందేసుకున్నాడు. కులం, సంపదల కారణంగా మనిషికి మనిషికి మధ్య భేదాలుండటం ఆ గ్రంథాల్లో కనిపించింది. చాలాసేపు ఆలోచిస్తూ గడిపాడు. ఆ తరువాత దేవుని ముందు మోకరిల్లి "వివిధ రూపాలలో జగమంతటా వ్యాపించి ఉన్న ఓ భగవంతుడా! ఎప్పటికప్పుడు నా తప్పుల్ని ఎత్తిచూపి, సన్మార్గాన నడిపించడానికి, నీ దూతలు వివిధ రూపాల్లో నా జీవన మార్గంలో ఎదురవుతున్నారు. చనిపోయిన నా సోదరుని కళ్ళల్లో నీ దూతను గుర్తించగల శక్తిని నాకు ప్రసాదించు. నేను నా జీవితాన్ని పవిత్రం చేసుకుని, పాపాలకు దూరంగా బతికేలా చెయ్యి," అని ప్రార్థించాడు.

విరాట్ ముఖంలో మళ్ళీ వెలుగొచ్చింది. ఆయన కళ్ళలోని విచారం తొలగిపోయింది. ఆకాశంలో మినుకు మినుకుమంటూ ప్రకాశిస్తూ ఆహ్వానించే నక్షత్రాల్ని, తొలి సంధ్యకు ముందు వీచే పరిశుద్ధ పవనాల్లోని తాజాదనపు ఆనందాన్ని అనుభవించడానికి ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. తోటగుండా ప్రయాణించి నది వద్దకు చేరుకున్నాడు. సూర్యోదయం కాగానే పవిత్ర నదీ ప్రవాహంలో మునకలేశాడు. స్నానం అయ్యాక ఉదయం జరిగే దైవ ప్రార్థనల్లో కుటుంబ సభ్యులు అందరితో కలిసి పాల్గొనడానికి త్వరగా ఇంటికి బయలుదేరాడు. చిరునవ్వుతో అందర్నీ పలకరించాడు. స్త్రీలను అక్కడి నుంచి వెళ్ళిపొమ్మని సైగ చేశాడు. ఆ తరువాత కొడుకులతో ఇలా చెప్పాడు.

"పవిత్రంగా, పాపాలకు దూరంగా జీవితాన్ని గడపడానికి ఇన్నేళ్ళ నుంచి నేను తాపత్రయ పడుతున్న విషయం మీకు తెలుసు. నేను ఉంటున్న ఈ ఇంటి నేల మీద నిన్న రక్తం చిందింది. ఆ రక్తం ఒక సజీవ వ్యక్తిది. ఆ రక్తం చిందిన అపరాధం నుంచి నేను బయటపడాలని, నా ఇంట్లో జరిగిన దారుణానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని అనుకుంటున్నాను. చిన్న అపరాధానికి క్రూరంగా దండన పొందిన ఆ బానిస ఈ క్షణం నుంచి బంధ విముక్తుడవుతాడు. భగవంతుడి ముందు జరిగే పాపపుణ్యాల విచారణలో మీపై, నాపై నేరారోపణ చేయకుండా ఉండేందుకైనా అతన్ని వదిలేయండి. తనకు ఇష్టమున్న చోటికి అతను పోతాడు," అన్నాడు.

కొడుకులంతా మౌనంగా ఉండిపోయారు. అది నిరసనతో కూడిన మౌనం అని విరాట్‌కి అర్థం అయింది. "మీరు సమాధానం చెప్పడంలేదు. మీరేం చెబుతారో వినకుండా, మీ అభీష్టానికి వ్యతిరేకంగా నేను ప్రవర్తించాలనుకోవడం లేదు."

"మీరొక అపరాధికి స్వేచ్ఛ ఇవ్వాలనుకుంటున్నారు. శిక్షించడానికి బదులు బహూకరించాలనుకుంటున్నారు. మన ఇంట్లో చాలా మంది సేవకులున్నారు. కాబట్టి ఒకడు పోతే నష్టమేంలేదు. కాని వాణ్ణి చూసి రేపు ఇంకొకడు పారిపోతాడు. మిగిలిన వాళ్ళు కూడా పోతామంటే ఎలా ఆపగలం?" అన్నాడు పెద్దకొడుకు.

"వాళ్ళు వెళ్ళిపోవాలనుకుంటే నేను అడ్డుపడను. వాళ్ళను వెళ్ళనిస్తాను. నేను మరొకరి జీవిత నిర్ణేతను కాను. మరొకరి జీవితాలను నిర్దేశించేవాడు అపరాధి."

"మీరు రాజ శాసన నిబంధనల్ని బలహీన పరుస్తున్నారు. ఈ భూమి మనదైనట్టు, ఈ భూమిపై పెరిగే చెట్లు మనవైనట్టు, వాటికి కాసే కాయలు మనవైనట్టు ఈ బానిసలు మన ఆస్తి. వాళ్ళు మీకు సేవ చేసినంతకాలం వాళ్ళు మీకు చెందుతారు. మీరు వాళ్ళకు చెందుతారు. కొన్ని వేల సంవత్సరాల నుంచి పరంపరగా వస్తున్న సంప్రదాయాల్లో మీరు జోక్యం చేసుకుంటున్నారు. బానిస అతని సొంత జీవితానికి యజమాని కాడు. మరో యజమానికి అతను సేవకుడు," అన్నాడు రెండవ కుమారుడు.

"భగవంతుడు మనకు ప్రసాదించిన ఒక హక్కు జీవించడం. ఆ అధికారం అందరికీ ఉంది. మీరు నాకు బాగానే బోధించారు. నేను పాపాల నుంచి దూరంగా బతుకుతున్నాననే భ్రమలో ఉన్నాను. కాని నేను ఇన్ని సంవత్సరాలుగా ఇతరుల జీవితాల్ని శాసిస్తూనే ఉన్నాను. ఇప్పుడు నాకు చక్కగా అర్థం అవుతోంది. సరైన వ్యక్తి ఎవరూ మనుషుల్ని మృగాలుగా మార్చడు. నేను బానిసలందరినీ విడుదల చేస్తాను. వాళ్ళ విషయంలో పాపానికి దూరంగా ఉంటాను."

కొడుకుల కనుబొమలు కోపంతో ముడిపడ్డాయి.

"పొలాలు ఎండిపోకుండా నీళ్ళెవరు పెడతారు? పశువుల్ని ఎవరు పోయి మేపుకొస్తారు? మీ పిచ్చి ఆలోచనల వల్ల మేం ఇకనుంచి సేవకులుగా మారాలా? మీ జీవితంలో ఏనాడైనా ఇంట్లో చిన్న పనైనా చేశారా? అటు వస్తువు తీసి ఇటు పెట్టారా? ఇతరుల శ్రమ మీద ఆధారపడే మీ జీవితం ఇంత సుఖంగా నడుస్తోందని మీరు ఏనాడూ ఆలోచించలేదు. మీరు పడుకునే మంచాలు, పరుపులు ఇతరులు తయారు చేసినవే. మీరు నిద్రపోయే వరకు మీకు పంకా విసిరేదీ ఒక బానిసే. ఈ రోజు మీరు అకస్మాత్తుగా బానిసలందర్నీ పంపించేస్తున్నారంటే మీ రక్తం పంచుకు పుట్టిన కొడుకులు ఆ పనులన్నీ చెయ్యాలనేగా? ఆ ఎద్దులను కూడా వదిలేయండి. వాటికి మాత్రం నొప్పి కలిగించడం ఎందుకు? వాటికి బదులుగా మేమే కాడి లాగి పొలం దున్నుతాం. మనుషులకు మాదిరే మాటలురాని ఈ పశువులకు కూడా భగవంతుడు జీవితాన్ని ఇచ్చాడు కదా! మీరొకటి గుర్తించుకోండి. బలప్రయోగం మీద ఆధారపడి ప్రపంచం నడుస్తోంది. భూమిపై కూడా

బలప్రయోగం చెయ్యకపోతే అంటే దున్నకపోతే భూమి కూడా పంటలనివ్వదు. బలప్రయోగానికి దూరంగా మనం ఉండలేం," అంటూ పెద్ద కొడుకు గట్టిగా వాదించాడు.

"కానీ నేను దూరంగా ఉంటాను. బలం ఏ రకంగానూ సరైంది కాదు. నేను నా జీవితాన్ని ధర్మపథంలో నడుపుకుంటాను."

"నాది అని దేని గురించి అయినా చెప్పుకున్నారంటే అది మీ బలం వల్లనే మీదిగా ఉంది. మనిషి కావచ్చు, పశువు కావచ్చు, భూమి కావచ్చు. వీటిపై అధికారం వల్లనే మీకు బలం లభిస్తుంది. మీరు యజమాని అయినప్పుడు మీరు బలం కలిగి ఉండడం కూడా అవసరం. చేతిలో అధికారం ఉన్నవాడు మనుషుల విధికి లోబడే ఉంటాడు."

"కాని పాపం చెయ్యాల్సిన అవసరం కలిగించే అన్నింటి నుంచి నేను దూరంగా ఉంటాను. అందుకే బానిసలందర్నీ విముక్తుల్ని చెయ్యండి. మీకు అవసరమైన పనులన్నీ మీరే స్వయంగా చేసుకోండి."

కొడుకులు కోపాన్ని బలవంతంగా దిగమింగుకున్నారు. పెద్దకొడుకు మళ్ళీ అందుకున్నాడు. "మీరే చెప్పారు. ఇతరుల అభీష్టాలపై ఆంక్షలు పెట్టనని. పాపం చుట్టుకుంటుందని భయపడి బానిసల్ని శాసించరు. మరి అది చెయ్యి, ఇది చెయ్యొద్దు అని మమ్మల్నెందుకు శాసిస్తున్నారు? మా జీవితాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు? మానవ దృష్టిలో కానీ, భగవంతుని దృష్టిలో కానీ మీరు చేసేది ఏ విధంగా సమంజసమో చెప్పండి?"

విరాట్ చాలా సేపు మౌనం వహించాడు. తల పైకెత్తి కొడుకుల వంక చూశాడు. వాళ్ళ కళ్ళల్లో అత్యాశ తొణికిసలాడుతోంది. విరాట్ మనసు ఆర్ద్రమయింది. సున్నితంగా చెప్పాడు.

"మీరు నాకు పాఠం నేర్పారు. మిమ్మల్ని ఏదో విధంగా అడ్డుకోవడం నా ఉద్దేశం కాదు. ఇంటిని, సంపదను మీరే తీసుకోండి. ఎవరెవరికి ఏవేవి అవసరమో ఆ విధంగా పంచుకోండి. వాటిలో నాకేం భాగమూ వద్దు, వాటితో వచ్చే పాపమూ వద్దు. శాసించేవాడు ఇతరుల స్వాతంత్ర్యాన్ని అణిచేస్తాడని మీరు చెప్పింది నిజమే. కానీ తన ఆత్మనే బానిసను చేసుకోవడమనేది అన్నింటికన్నా నీచమైనది. పాపాలకు దూరంగా ఎవరు బతకాలనుకుంటారో వాళ్ళు ఇంటి యాజమాన్యం నుంచి, ఇతరుల జీవితాల్ని నడిపించే బాధ్యతల నుంచి దూరంగా ఉండాలి. ఇతరుల శ్రమపై ఆధారపడి బతకకూడదు. స్త్రీలతో భోగవిలాసాలకు, ఆనందంతో వచ్చే సోమరితనానికి దూరంగా ఉండాలి. ఒంటరిగా బతికే వ్యక్తే భగవంతుడికి దగ్గరగా ఉంటాడు. శ్రమించేవాడికే భగవంతుని ఉనికి తెలుస్తుంది. పేదరికానికే భగవంతుని విశ్వరూపం గోచరిస్తుంది. కనిపించే ఈ ఆస్తిపాస్తులకంటే

కనిపించని ఆ భగవంతుడికి దగ్గరగా ఉండడమే నాకిష్టం. పాపాలకు దూరంగా బతకాలనేది నా కోరిక. ఆస్తిపాస్తులు అన్నీ తీసుకోండి. శాంతియుతంగా వాటిని పంచుకోండి," అంటూ విరాట్ అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు. ఆయన కొడుకులందరూ ఆశ్చర్యంతో అలాగే నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. వాళ్ళ ఆశ నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది. కాని లోలోపల చాలా సిగ్గుపడ్డారు.

చీకటి పడగానే ఇంటి నుంచి వెళ్ళిపోవడానికి విరాట్ అంతా సిద్ధం చేసుకున్నాడు. ఒక చేతికర్ర, భిక్షాపాత్ర, చెట్లు కొట్టే గొడ్డలి, తినడానికి కొద్దిగా పళ్ళు, సిద్ధుల సూక్తులున్న తాళపత్ర గ్రంథాలు కొన్ని సర్దుకున్నాడు. ధోవతిని మోకాళ్ళపైకి ఎగగట్టాడు.

భార్యతో, కొడుకులతో, కుటుంబ సభ్యులెవరితోనూ చెప్పకుండానే, వాళ్ళ దగ్గర వీడ్కోలు తీసుకోకుండానే బయలుదేరాడు. రాత్రంతా నడిచాడు. తెల్లవారు ఝామికి ఒక నదీ తీరానికి చేరుకున్నాడు. సోదరుని హత్యతో భీతిల్లి ఖడ్గాన్ని ఒదిలేసిన ప్రదేశమది. విరాట్‌లో సత్యాన్వేషణా బీజాన్ని నాటిన నదీ తీరమది. ఆ రేవు దాటి నదికి ఆవలి తీరాన్నే కొంత దూరం ముందుకు నడిచాడు. అక్కడ మనిషి మసలని, ఎప్పుడూ సాగులోకి రాని నిర్జన ప్రదేశం కనిపించింది.

సూర్యోదయమయ్యేసరికి ఒక చోటుకి చేరుకున్నాడు. అక్కడ పిడుగుపడి ఒక పెద్ద మామిడి చెట్టు కాలిపోయి ఉంది. ఆ మంటకు ఆ చెట్టు చుట్టుపట్ల కొంతమేర అడవి కూడా కాలిపోయి తెరిపిగా ఉంది. అక్కడ నదీ ప్రవాహం కాస్త ఒంపు తిరిగి ప్రశాంతంగా ప్రవహిస్తోంది. పక్షులు అసంఖ్యాకంగా ఆ నదిలో నిర్భయంగా నీళ్ళు తాగుతున్నాయి.

ఎదురుగా సుందర నదీ ప్రవాహం, వెనక దట్టమైన చెట్ల చల్లని నీడ. పిడుగుపాటుకు కాలిపోయిన చోట అక్కడక్కడ చిన్న చిన్న మొక్కలు ఇప్పుడిప్పుడే మొలుస్తున్నాయి. మనోహరంగా ఉన్న ఆ ప్రాంతాన్ని చూసి విరాట్ అక్కడ ఒక కుటీరాన్ని నిర్మించు కోవాలనుకున్నాడు. తన శేష జీవితాన్ని తనవాళ్ళకు దూరంగా, పాప విముక్తుడై ధ్యానంలో గడుపుకోవాలని నిశ్చయించుకున్నాడు.

శ్రమ చెయ్యడం అంతకు ముందు అలవాటు లేనందువల్ల కుటీరం నిర్మించుకోవడానికి ఐదు రోజులు పట్టింది. కుటీరం నిర్మించుకున్నాక కూడా ఆయనకు రోజంతా పని ఉండేది. తినడానికి పండ్లు, ఫలాలు వెతుక్కోవాల్సి వచ్చేది. కుటీరం చుట్టూతా పుట్టుకొచ్చే గడ్డి మొక్కల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవాడు. ఆకలిగొన్న చిరుత పులులు రాత్రులు అడవిలో తిరుగుతూ ఉంటాయి. వాటినుంచి రక్షణ పొందడం కోసం కుటీరం చుట్టూతా ముళ్ళకంచె ఏర్పాటు చేసుకున్నాడు.

విరాట్ అడవిలోకి వచ్చాక మరో మనిషి మాట కూడా వినబడలేదు. ఆయన ఏకాగ్రతకు భంగం కలగలేదు. నదీ ప్రవాహంలాగా కాలం కూడా ప్రశాంతంగా గడిచిపోతూ ఉంది.

కొత్తగా వచ్చిన వ్యక్తి ప్రశాంతంగా తన పనులు తాను చేసుకుపోవడం చూసి, ఆయన వల్ల ప్రమాదం ఏమీ లేదని భావించాయి అక్కడి పక్షులు. కొద్ది రోజుల్లోనే విరాట్ కుటీరం కప్పుపై నిర్భయంగా పక్షులు గూళ్ళు కట్టుకోసాగాయి. వాటికి విరాట్ అప్పుడప్పుడు బాగా పండిన పళ్ళు, గింజలు ఆహారంగా పెడుతుండేవాడు. నెమ్మదిగా విరాట్‌కు, పక్షులకు మధ్య స్నేహం కుదిరింది. ఆయన పిలిస్తే చాలు పక్షులు ఎక్కడెక్కడి చెట్ల నుంచి వచ్చి ఆయన ముంగిట వాలేవి. విరాట్ వాటితో ఆడుకునేవాడు. అవి కూడా భయపడకుండా ఆయనకు దొరికేవి.

అడవిలో ఒక రోజు ఒక కోతిపిల్ల కాలు విరగ్గొట్టుకుని పసిబిడ్డలాగా రోదిస్తూ ఉండటం విరాట్ చూశాడు. దాన్ని ఎత్తుకుని కుటీరానికి తీసుకువచ్చాడు. దాని బాగోగులు చూస్తూ త్వరలో నయం అయ్యేలా చేశాడు. ఆ తరువాత అది పెంపుడు జంతువులా కుటీరంలో ఉండిపోయింది. సరదాగా విరాట్‌ని అనుకరించేది. ఆయన ఏ పని చేస్తే అదీ అలా చేసేది. విరాట్ పట్ల చాలా విశ్వాసపాత్రంగా మెలిగేది. అలా అలా ఆయన చుట్టూ పశుపక్ష్యాదులు చాలా చేరాయి.

అయితే జంతువుల్లో మనుషుల్లోకన్నా ఎక్కువగా హింసాప్రవృత్తి, చెడు ఉంటాయన్న విషయం ఆయనెప్పుడూ మరిచిపోలేదు. మొసళ్ళు పోట్లాడుకుని ఒకదాన్నొకటి క్రోధంతో ఎలా తరుముకుంటాయో చూశాడు. పక్షులు నదిలో చేపలు వేటాడే పద్ధతి, పాములు చుట్టలు చుట్టుకొని పడుకొని ఉండి హఠాత్తుగా పక్షుల్ని ఎలా పట్టుకుంటాయో చూశాడు. ఇలాంటివన్నీ ఆయన నిత్యం గమనిస్తూ ఉండేవాడు. ప్రకృతి ప్రళయశక్తి ప్రపంచాన్ని విధ్వంసకర సంకెళ్ళ క్రమంతో బంధించింది. ఈ నియమంలో సత్యాన్ని ఆయన అంగీకరించాడు. కాని ఆ సంఘర్షణల్లో పాల్గొనక ప్రేక్షకుడిగా ఉండిపోవడం ఆయనకు సంతోషం కలిగించింది. విరాట్ మరో మనిషి ముఖం చూసి దాదాపు రెండు సంవత్సరాలైంది. ఒక రోజు ఓ వేటగాడు ఏనుగును తరుముకుంటూ, నదికి ఆవలి ఒడ్డున అది నీళ్ళు తాగుతున్న ప్రదేశానికి వచ్చాడు. అప్పుడొక అద్భుత దృశ్యం ఆ వేటగాని కళ్ళబడింది.

అది సూర్యాస్తమయ సమయం. ఒక గడ్డం నెరిసిన మనిషి కుటీరం ముందు కూర్చుని ఉన్నాడు. సూర్యుని పసిడి కిరణాల కాంతి అతని శరీరం మీద పడి మెరుస్తోంది. పక్షులు ఆయన తలమీద, భుజాలమీద వాలుతూ లేస్తూ ఆయనతో ఆడుకుంటున్నాయి. ఒక కోతి ఆయన కాళ్ళ దగ్గర కూర్చుని రాయితో కాయలు పగలగొట్టి గింజలు ఆయనకు

అందిస్తోంది. కాని ఆయన మాత్రం రంగు రంగుల చిలకలు చెట్ల కొమ్మల్లో ఆడుకోవడం చూస్తున్నాడు. ఆయన సైగ చేయగానే అవన్నీ పసిడి మేఘాకారంలో నాట్యం చేస్తున్నట్టు ఎగిరి వచ్చి ఆయన చేతుల మీద వాలాయి.

ఆ దృశ్యం చూశాక తానొక మహాత్ముణ్ణి దర్శించినట్టుగా వేటగాడు భావించాడు. ఆయనతో పశువులు మానవ భాషలో మాట్లాడతాయి. ఆయన పాదాల కింద పుష్పాలు వికసిస్తాయి. ఆయన పెదాలతో నక్షత్రాలను తెంపగలడు. ఒక ఊదు ఊది చంద్రుణ్ణి ఆకాశం నుంచి ఎగరగొట్టగలడు అనిపించిందతనికి. తాను వచ్చిన పని మరిచిపోయి, తాను చూసింది పట్నంలో వాళ్ళందరకు చెప్పడం కోసం వేటగాడు పట్నం వైపు పరుగుతీశాడు.

మరునాటి ఉదయంనుంచే ఈ వింతను చూసేందుకు నది అవతలి గట్టుకు జనం గుంపులు గుంపులుగా రాసాగారు. పోను పోను గుంపు పెరగసాగింది. చివరికి గుంపులో ఒకతను విరాట్‌ని గుర్తించాడు. త్వరలోనే ఈ వార్త విస్తృతంగా వ్యాపించింది. విరాట్ లాంటి సహాయకుణ్ణి కోల్పోయినందుకు చింతిస్తున్న రాజుగారికి కూడా ఈ వార్త తెలిసింది.

మహారాజుగారు వెంటనే పరివారంతో సహా బయలుదేరారు. విరాట్ కుటీరాన్ని చేరుకోగానే రాజుగారు దిగడానికి తివాచీ పరిచారు. తపస్విలా ఉన్న విరాట్ దగ్గరకు రాజుగారు వెళ్ళారు. రెండు సంవత్సరాలుగా విరాట్ మనిషి మాట విని ఎరగడు, తను మాట్లాడనూ లేదు. అతి కష్టంమీద రాజుగారిని అభినందించాడు. రాజుగారికి ప్రజలు ఎలా నమస్కరిస్తారో కూడా ఆయన మరచిపోయాడు.

మొత్తానికి మాటలు కూర్చుకుని "మహారాజా, మీ రాక శుభప్రదమవుగాక!" అన్నాడు.

మహారాజుగారు ఆయనను హృదయానికి హత్తుకున్నారు.

"మీరు పరిపూర్ణ మానవుడిగా రూపొందుతున్న క్రమాన్ని అనేక సంవత్సరాల నుంచి నేను గమనిస్తున్నాను. మీలోని అసాధారణ, అద్భుత ధర్మ పరాయణత్వాన్ని దర్శించుకోవడానికి వచ్చాను. మహోన్నత వ్యక్తి ఎలా జీవిస్తారో నేను కూడా నేర్చుకుంటాను," అన్నాడు.

విరాట్ నమస్కరించాడు.

"ఏకాంత వాసం చేసేవాడు తనకు తాను తప్ప ఇతరులకేం బోధించలేడు. నేను చేస్తున్న పని వివేకమయిందో కాదో నాకు తెలియదు. ఇప్పుడు నేను అనుభవిస్తున్నది ఆనందమో కాదో కూడా నాకు తెలియదు. నేనేం సలహాలివ్వలేను. నేనేం బోధించనూ లేను. ఆత్మజ్ఞానానికి, ప్రపంచ జ్ఞానానికి చాలా తేడా ఉంది."

"జ్ఞాని ఎలా జీవిస్తాడో గమనించి కొంత నేర్చుకోవచ్చు. మిమ్మల్ని చూస్తున్నప్పటి

నుంచీ ఒక అలౌకికమైన ఆనందంతో నా మనసు నిండిపోయింది. అంతకన్నా నాకేం అక్కరలేదు. నా రాజ్యంలో మీ కోసం నేను చెయ్యాల్సింది ఏమైనా ఉందా? మీ వాళ్ళకేమైనా సందేశం పంపుతారా?"

"మహారాజా! 'నా' అనేది ప్రత్యేకంగా నాకేమీ లేదు. లేదా ఈ ప్రపంచమంతా నాదే. అందరి ఇళ్ళతోపాటు నాకూ ఒక ఇల్లుందని, అందరి పిల్లలతోపాటు నాకూ పిల్లలున్నారనే విషయమే నేను మరిచిపోయాను. ఇల్లు లేనివాడికి ప్రపంచమంతా తన ఇల్లే. జీవిత బంధనాల్ని తెంచుకున్న వాడికే నిజమైన జీవితం లభిస్తుంది. నిష్కపటికి అంతా శాంతే. ఈ భూమి మీది నా జీవితాన్ని పాపాలకు దూరంగా గడపాలనేదే నా ఏకైక కోరిక," అన్నాడు విరాట్.

"సెలవు తీసుకుంటాను. నీ ప్రార్థనలో నన్ను కూడా తలుచుకో," అన్నారు మహారాజు.

"నేను భగవంతుణ్ణి తలుచుకుంటాను. ఆ విధంగానే మిమ్మల్ని, ఈ భూమి మీద నివసిస్తున్న పరమాత్మ స్వరూపులైన వాళ్ళందర్నీ తలుచుకుంటాను."

మహరాజుగారు పరివారంతో బయలుదేరారు.

విరాట్ పేరు ప్రతిష్ఠలు మళ్ళీ రాజ్యమంతా పాకిపోయాయి. కుగ్రామాలకు, సముద్ర తీరాన గుడిసెలు వేసుకుని ఉండే వాళ్ళకు కూడా ఇంటిని విడిచి, సర్వ సంపదలను త్యజించి ధ్యానంతో జీవితాన్ని గడుపుతున్న ఈ తపస్వి గురించి తెలిసిపోయింది. 'ఏకాంతవాస ధృవతార' అనే పేరుతో ఆయన ఖ్యాతి దశ దిశల వ్యాపించింది. దేవాలయాల్లో పూజారులు కూడా విరాట్‌ని కీర్తించేవాళ్ళు. మహారాజుగారు కూడా విరాట్ ఔన్నత్యం గురించి సేవకులకు చెప్పేవారు. న్యాయాధికారులు తీర్పులు చెప్పేముందు "భగవంతునికి జీవితం అంకితం చేసిన సర్వజ్ఞాని విరాట్ తీర్పువలే నా తీర్పు ఉండేలా భగవంతుడు అనుగ్రహించుగాక," అనేవారు.

కాలం గడిచేకొద్దీ తమ జీవన విధానం సక్రమంగా లేదని భావించినవాళ్ళు, రోజువారీ జీవితంలో తాము చేస్తున్న పాపకర్మలకు పశ్చాత్తాపపడిన వాళ్ళు, జీవితం నిస్సారంగా తోచినవాళ్ళు విరాట్‌ని ఆదర్శంగా తీసుకుని ఇల్లూ వాకిలి వదిలి, సంపదలను త్యజించి శేష జీవితాన్ని భగవంతుని సేవలో గడపడానికి అడవులకొచ్చి విరాట్‌లాగా కుటీరాలు నిర్మించుకోసాగారు. స్వయంగా ఆచరించి చూపడం అంత ఉత్తమమైన పని ఈ భూమి మీద మరొకటి లేదు. ప్రతి మంచి పని ఇతరులలో మంచి పనులు చేయాలనే కోర్కెను రేకెత్తిస్తుంది. ఆ కోర్కె ఇప్పుడు కలలనుంచి తట్టి లేపి కార్యాచరణకు పురికొల్పింది. ఈ జ్ఞానోదయం కలిగిన వాళ్ళందరికీ తామెంత నిస్సారంగా జీవితాలను గడుపుతున్నామో

అర్థం అయింది. తమ చేతులెంత రక్తసిక్తమయ్యాయో, పాపాలతో తమ ఆత్మలెలా కళంకితమయ్యాయో అవగతమయింది.

వాళ్ళంతా ఏకాంత వాసానికి పోసాగారు. జీవించడానికి కావలసిన పళ్ళు, నీళ్ళు లాంటివి లభిస్తే తృప్తిపడసాగారు. వీళ్ళు పండ్ల కోసం అడవిలోకి వెళ్ళినప్పుడు మరో సర్వసంగ పరిత్యాగి ఎదురైనా పలకరించుకునే వాళ్ళు కాదు. దాని వల్ల కొత్త బంధాలు ఏర్పడతాయోమోనని భయపడేవాళ్ళు. అయితే హృదయపూర్వకంగా చిరునవ్వు నవ్వే వాళ్ళు. వాళ్ళ హృదయాలు ప్రశాంతంగా అభినందించుకునేవి. ఆ అడవిని గురించి ప్రజలు మాట్లాడుకునేటప్పుడు అక్కడ సాధువులు, మహాత్ములు ఉంటారని చెప్పుకునేవాళ్ళు. వేటతో ఆ పవిత్ర ప్రాంతం కలుషితమవుతుందనే భయంతో వేటగాళ్ళెవరూ ఆ దరిదాపులకు కూడా వచ్చేవాళ్ళు కాదు.

ఒక రోజు ఉదయం విరాట్ తన కుటీరం వదిలి అడవిలోకి వెళ్ళినప్పుడు అచేతనంగా పడివున్న ఒక సాధువు శరీరం కనిపించింది. అతన్ని లేపి, కూర్చో బెట్టాలని ప్రయత్నించాడు. కాని అది ప్రాణం లేని శరీరమని తెలిసింది. విరాట్ ఆ సాధువు కళ్ళు మూసేశాడు. ఏదో ప్రార్థన చేశాడు. ఆ శవాన్ని అక్కడినుంచి తీసుకువెళ్ళి అంత్యక్రియలు సక్రమంగా జరిపించాలని భావించాడు. ఆ శవాన్ని రెండు చేతుల్లోకి ఎత్తుకోవాలని చూశాడు. కాని లేపలేక పోయాడు. చాలా కాలం నుంచి సరైన తిండిలేక పండ్లు, ఫలాలతో సరిపెట్టుకోవడం వల్ల శక్తి ఉడిగి పోయింది. సహాయం కోసం నది దాటి దగ్గరలో ఉన్న గ్రామానికి బయలుదేరాడు.

ఏకాంతవాస ధృవతార అని తాము భక్తితో పిలుచుకునే సాధువు ఊళ్ళోకే రావడం చూసి ప్రజలు అచ్చెరువొందారు. ఆయన చుట్టూతా పెద్ద గుంపుగా చేరారు. ఆయన వచ్చిన పని చెప్పాడు. ఆయనకు సాయపడడానికి నేనంటే నేనని చాలా మంది ముందుకొచ్చారు.

విరాట్ తిరిగి వెళుతూ ఉంటే ప్రతిచోటా స్త్రీలు ఆయనకు భక్తితో నమస్కరించారు. పురుషులు ఆయనకు ప్రణమిల్లి ఆయన ఆశీర్వాదం కోరుతూ ఆయన బట్టల్ని ముద్దు పెట్టుకున్నారు. భక్తిప్రపత్తులతో స్వాగతం పలుకుతున్న ప్రజల మధ్య నుంచి సంతృప్తితో కూడిన చిరునవ్వుతో విరాట్ ముందుకు నడిచాడు. వీళ్ళతో ఏ విధమైన అనుబంధం లేకపోయినా వీళ్ళ పట్ల విరాట్‌కు ఎంతో నిర్మలమైన, ఆత్మీయతతో కూడిన ప్రేమ కలిగింది.

ప్రజల హృదయపూర్వక నమస్కారాన్ని స్వీకరిస్తూ ముందుకు వెళుతున్న విరాట్‌కు ఒక ఇంట్లో నుంచి ఒక స్త్రీ ద్వేషంగా తనవైపు చూడడం గమనించి ఆగాడు. తాను పొరపాటుపడ్డానేమో, ఆమె అలా చూసి ఉండదేమోనని భావించి ఆమె వైపు మళ్ళీ చూశాడు. ద్వేషంతో, నిప్పులు కక్కుతున్నట్లుగా విరాట్ వైపు చూస్తున్నాయి ఆమె కళ్ళు. విరాట్ భయంతో ఒణికిపోయాడు. ఆమె కళ్ళు చూస్తే తను హత్య చేసిన తన సోదరుని కళ్ళు గుర్తుకొచ్చాయి. ఆ కొండజాతి యువకుడి కళ్ళు జ్ఞాపకం వచ్చాయి. అడవిలోకి వచ్చి ఏకాంతవాసం చేయసాగాక ఆ పీడ జ్ఞాపకాల్ని అతడు మరిచిపోయాడు. తాపసిగా మారాక ఇతరుల కోపం, ద్వేషం ఎలా ఉంటాయో మరిచిపోయాడు.

ఆమె తనను తప్పుగా అర్థం చేసుకుందేమో! ఎవరో అనుకుని నా పట్ల విద్వేషంతో వ్యవహరిస్తోందేమో! ఆమెతోనే మాట్లాడదామనుకుని విరాట్ ఆమెవైపు కదిలాడు. చిరుతపులిలా ఆమె విరాట్‌వైపు చూసి ఇంట్లోకి వెళ్ళిపోయి తలుపులేసుకుంది. విరాట్ ఆశ్చర్యపోయాడు.

'ఆమె ఎవరు? తనెప్పుడూ చూడలేదు. పరిచయం అయ్యే అవకాశం కూడా లేదు. వయసులో ఆమె చాలా చిన్నది. తన జీవితంలో ఏవిధంగాను, ఎప్పుడూ తటస్తపడే అవకాశం కూడాలేదు. అలాంటప్పుడు ఆమెను నేనెలా బాధించి ఉంటాను?' తనలో తానే మథనపడ్డాడు. 'ఎక్కడో ఏదో లోపం ఉంది. కనుక్కోవాలి,' అనుకుని ఆమె ఇంటికి వెళ్ళి తలుపు కొట్టాడు. సమాధానం లేదు. ఆ అపరిచిత స్త్రీ తనను ఇంకా ద్వేషిస్తూనే ఉంది అనిపించింది. చాలా సహనంగా మరోసారి తలుపుకొట్టాడు. అయినా ఆమె తలుపు తియ్యలేదు. కొద్దిసేపు ఆగి భిక్షగాడిలాగా మళ్ళీ తలుపు కొట్టాడు. కొంతసేపటికి ఆమె సంకోచిస్తూనే తలుపు తీసి ద్వారబంధం దగ్గరకొచ్చి నిలబడింది. ఇంకా ఆమె విరాట్‌వైపు ద్వేషంతో చూస్తూనే ఉంది.

"ఇంకా నా నుంచి ఏం కావాలి మీకు?" కోపంతో ఊగిపోతూ ప్రశ్నించింది. ఆమె కోపంతో ఊగిపోయిన తీరుకి కింద పడిపోయేది. అయితే ద్వారబంధం పట్టుకుని పడకుండా తమాయించుకుంది.

ఆమె ముఖాన్ని పరిశీలనగా చూశాక విరాట్ మనసు కాస్త కుదుట పడింది. ఆమెను అంతకు ముందు ఎప్పుడూ చూడలేదని దృఢమైన నమ్మకం ఏర్పడింది. ఆమె వయసు దృష్ట్యా కూడా తన జీవిత యాత్రలో ఆమె ఎక్కడా తటస్థపడే అవకాశం లేదనిపించింది. అందుకే ఆమెనే అడిగాడు.

"మిమ్మల్ని పలికరిద్దామని వచ్చాను. మీరు నావైపు అంత ద్వేషంగా ఎందుకు చూస్తున్నారో అర్థం కావడం లేదు. నేను మీకు శత్రువునా? మీకేమైనా అపకారం చేశానా?"

“నువ్వు నాకేం హాని చేశావ్!” వ్యంగ్యంగా నవ్వింది. “అవును నువ్వు నాకేం హాని చేశావ్? కొద్దిగా చేశావు. నా ఇల్లు కళకళలాడుతుండేది. దాన్ని శూన్యం చేశావు. నా భర్తను నా నుంచి దూరం చేశావు. నా జీవితాన్ని చిదిమేసి మృత్యుముఖంలో పడేశావు. నీ ముఖం నాకు చూపించకు. నా కోపాన్ని దిగమింగుకోలేను. వెంటనే నువ్విక్కడనుంచి వెళ్ళిపో,” అంది ఆవేశంగా.

విరాట్ ఆమె వైపు చూశాడు. ఆమె కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. ఆమె కోపంతో రగులుకుపోతూ ఉంది.

“మీరు నన్ను ఎవరో అనుకుని ద్వేషిస్తున్నారు. నేను మనుషులకు చాలా దూరంగా బతుకుతున్నాను. ఎవరి జీవితాలతోనూ నాకు ప్రమేయం లేదు. మీరు పొరపాటు పడుతున్నారు,” అని చెప్పి, అక్కడినుంచి వెళ్ళిపోవడానికి బయలుదేరాడు.

ఆమె కోపంగా మండిపడింది. “నువ్వు నాకు తెలుసు. అందరిలాగే నేనూ నిన్ను గుర్తించగలను. నువ్వు విరాట్‌వి! అందరూ పిలిచే ‘ఏకాంతవాస ధృవతారవి’, ప్రజలందరిలో విశిష్ట గుణాలు ఆపాదింపబడిన వ్యక్తివి. నేను మాత్రం నిన్ను కీర్తించను. నా ఆరోపణ భగవంతుడు ఆలకించేదాకా నేను నిన్ను దూషిస్తూనే ఉంటాను. రా! అడుగుతున్నావు కాబట్టి నాకు ఏం కీడు చేశావో చూపిస్తాను,” అంది.

ఆశ్చర్యంగా నిలబడిపోయి ఉన్న విరాట్ చేయి పట్టుకుని అతన్ని ఇంట్లోకి తీసుకువెళ్ళింది. లోపలి గది తలుపు తీసింది. గదంతా చీకటిగా ఉంది. ఆ గదిలో ఒక మూలకు తీసుకువెళ్ళింది. అక్కడ చాప మీద చలనం లేని ఒక శరీరం పడి ఉంది. విరాట్ వంగి చూడాలనుకుని భయంతో వెనక్కి తగ్గాడు. ఆ శరీరం చనిపోయిన ఆమె కొడుకుది. ఆ అబ్బాయి కళ్ళు విరాట్‌ను దోషిలా చూస్తున్నాయి. ఆ కళ్ళు చూస్తే విరాట్‌కు చనిపోయిన తన అన్న కళ్ళు గుర్తొచ్చాయి.

ఆ అబ్బాయి పక్కన ఆమె జీవచ్ఛవంలా నిలబడి ఉంది. ఆమె దు:ఖంతో “వీడు మా మూడోవాడు. నా చిట్టచివరి సంతానం. మిగిలిన ఇద్దరిలాగే వీణ్ణీ నీ పొట్టన పెట్టుకున్నావు. ప్రజలంతా నిన్ను తాపసివని, దేవదూతవని అంటారు. కాని నువ్వు హంతకుడివి,” ఆమె ఆవేశానికి అంతులేకుండా పోయింది.

విరాట్ ఏదో చెప్పాలనుకున్నాడు. కాని ఆమె విరాట్ మాటలకి అడ్డుతగిలింది.

“ఈ మగ్గంచూడు, ఖాళీగా ఉన్న ఆ ముక్కాలిపీట చూడు. అక్కడ కూర్చునే నా పెనిమిటి రోజూ బట్టలు నేసేవాడు. ఆయనతో సమానమైన నేతగాడు ఈ ప్రాంతంలోనే లేదు. ఆయనతో బట్టలు నేయించుకోవడానికి ఎక్కడెక్కడినుంచో ప్రజలు వచ్చేవాళ్ళు. ఆయన వృత్తే మా కుటుంబానికి జీవనాధారం. మా జీవితాలు చాలా ఆనందంగా

గడిచిపోతుండేవి. మా ఆయన దయాళువు, శ్రమజీవి, చెడు స్నేహాలకు, దుర్మార్గులకు దూరంగా ఉండేవాడు. మాకు ముగ్గురు బిడ్డలు కలిగారు. మేం వాళ్ళను జాగ్రత్తగా పెంచాం. చక్కగా పెరిగి వాళ్ళు తండ్రి అంతటి వాళ్ళు అవుతారని ఆశలు పెట్టుకున్నాం.

"ఒక రోజు ఒక వేటగాడు మా ఊరికి వచ్చాడు. అంతకు ముందెన్నడూ అతన్ని మేం చూడలేదు. ఒక మనిషి సర్వమూ త్యజించి, అడవిలో కుటీరం నిర్మించుకుని భగవంతుని సేవలో జీవితం గడిపేస్తున్నాడనీ, ఆయనే భగవంతుని ప్రతిరూపంలా ఉన్నాడనీ ఆ వేటగాడు చెబుతుంటే నా భర్త కూడా తెలుసుకున్నాడు. అప్పటినుంచి నా భర్త కూడా క్రమేణా మాకు దూరమయ్యాడు. కుటుంబ సభ్యులతో కూడా ఎక్కువగా మాట్లాడకుండా వీలైనంత ఎక్కువసేపు మౌనంగా ఉండేవాడు. సాయంత్రాలు ఎక్కువ సేపు ధ్యానం చేసేవాడు. క్రమేణా వృత్తి మానేస్తూ ఎక్కువసేపు భగవధ్యానంలో గడిపేవాడు. ఉన్నట్టుండి ఒక రోజు రాత్రి మాకెవ్వరికీ చెప్పకుండా ఒంటరిగా అడవిలోకి వెళ్ళిపోయాడు. భగవంతుని సేవలో జీవితాన్ని గడపడం కోసం నువ్వు ఉంటున్న అడవికే – సాధువులు, మహాత్ములు నివశించే ప్రదేశమని నీవల్ల పేరొచ్చిన అడవికే వెళ్ళిపోయాడు.

"ఆయన జీవితాన్ని ఆయన చూసుకున్నాడు. ఆయన స్వార్థాన్ని ఆయన చూసుకున్నాడు. మమ్మల్ని గాలికి వదిలేశాడు. మా పరిస్థితి ఏమిటి? ఆయన మీద ఆధారపడి జీవిస్తున్న వాళ్ళం కదా! ఆయన వెళ్ళిపోగానే మాకు జీవనాధారం పోయింది. ఇంటికి దరిద్రం పట్టుకుంది. పిల్లలకు తిండి లేకుండా పోయింది. ఒకళ్ళ తరువాత మరొకళ్ళు చనిపోయారు. ఈ రోజే చివరివాడు చచ్చిపోయాడు. ఇదంతా నీవల్లే జరిగింది. నీవే నా భర్తను నీ మార్గంలోకి ఆకర్షించావు. నువ్వు భగవంతునికి దగ్గర కావడం కోసం నా బిడ్డల్ని నాకు దూరం చేశావు. నా పిల్లల్ని మట్టిపాలు చేశావు.

"కుటుంబంతో హాయిగా గడుపుతూ, కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తులకు సంసార బంధనాలు మిధ్య అనే భ్రమ కల్పించావు. ఏకాంతవాసంతో భగవంతునికి దగ్గర కావచ్చని నువ్వే ఒక ఉదహరణగా వీళ్ళందర్నీ అడవులకు ఆహ్వానించావు. వీళ్ళమీద ఆధారపడ్డ సంసారాలన్నీ ఏం కావాలనుకున్నావు? ఇవన్నీ నీకు తెలిసే చేసి ఉండకపోవచ్చు. కానీ పోషించే నాథుడు కరవై ఎన్నో సంసారాలు నీవల్లే కుప్ప కూలిపోయాయి.

"ఒక పని చేసే ముందు దీన్ని ఇతరులు అనుసరిస్తారేమో, దీని పరిణామాలెలా ఉంటాయో అని ఆలోచించనివాడివి నువ్వేం మహాత్ముడివి?"

విరాట్ భయంతో కంపించిపోయాడు. అతని పెదవులు వణికాయి. "నన్ను చూసి ప్రజలు ఇలా అనుకరిస్తారని అనుకోలేదు. నేను ఎన్నుకున్న మార్గంలో నేనొక్కడినే నడుచుకోవానుకున్నాను," అన్నాడు.

“ఓ మునీ! నీ జ్ఞానం ఏమయిందయ్యా? పసిపిల్లలకు కూడా అర్థంఅయ్యే ఈ చిన్న విషయం నీకు అర్థం కాలేదా? ప్రపంచంలోని సమస్త కార్యాలు భగవత్ కార్యాలే. ఏ మనిషి కూడా తన ఇష్టప్రకారం ఆ పనుల నుంచి, ఆ బాధ్యతల నుంచి తప్పించుకునే వీలు లేదు. నీ బుద్ధికి అహంకారం పట్టింది. నీ కర్మలకు నీవే కర్తవు కాగలవనుకున్నావు. ఈ విషయాన్ని ఇతరులకు బోధించగలననుకున్నావు. నీకు అమృతమైన విషయం నాకు విషమైంది. నీ జీవితాదర్శం కారణంగా నా బిడ్డలు బలైనారు.”

విరాట్ కొంచెంసేపు ఆలోచించి ఆమె మాటల్ని అంగీకరించి, తలవంచుకున్నాడు.

“మీరు చెప్పింది నిజమే. మునుల ఏకాంతవాసంలో కంటే కర్తవ్య నిర్వహణలో ఒంటరిగా క్షోభననుభవించే వ్యక్తిలోనే ఎక్కువ సత్యదర్శనం అవుతుంది. నేను నేర్చుకున్నదేమైనా ఉంటే అది దరదృష్టవంతుల్ని చూసి నేర్చుకున్నదే. బాధితుల చూపుల్లో కనిపించే నా అన్న చూపుల్ని చూసి గ్రహించిందే. నేను ఊహించుకున్నంతగా భగవంతుని ఎదుట వినమ్రుణ్ణి కాలేకపోయాను. పైగా అహంకారినయ్యాను. నేను ఈ క్షణాన అనుభవిస్తున్న బాధవల్లే నాకీ జ్ఞానోదయమయింది. సంసార బంధనాలకు దూరంగా కార్యశూన్యుడుగా బ్రతుకున్నాననుకునే వ్యక్తి కూడా తెలిసో తెలియకో ఏదో ఒక కర్మ ఆచరిస్తూనే ఉంటాడు. దానికతడు ఈ భూమిమీద బాధ్యుడనేది సత్యం.

“నేను మిమ్మల్ని క్షమాభిక్ష వేడుకుంటున్నాను. నేను అడవి నుంచి, ఆ ఏకాంత వాసం నుంచి తిరిగి వస్తాను. నీ భర్త కూడా నావలే తిరిగి వచ్చి మీకొక కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాడు. మళ్ళీ మీకు సంతానం కలుగుతుందని నా ఆశ. దాంతో మీకు కొంత ఊరట కలుగుతుంది,” అన్నాడు.

విరాట్ ముందుకు వంగి గౌరవ సూచకంగా ఆమె చీర కొంగును కళ్ళకు అద్దుకున్నాడు. ఆమె మనసులో ఉన్న క్రోధమంతా తుడిచి పెట్టుకుపోయింది. వెళ్ళిపోతున్న విరాట్‌వైపు ఆమె ఆశ్చర్యంగా అలా చూస్తూ ఉండిపోయింది.

విరాట్ ఆ రోజు రాత్రి తన కుటీరంలోనే గడిపాడు. మెరిసే నక్షత్రాలను ఆ రాత్రి చాలా సేపు తదేకంగా చూశాడు. సూర్యోదయం కాగానే కాంతులీనే నక్షత్రాలుకనుమరుగై పోవడం గమనించాడు. పక్షుల్ని ఆహ్వానించాడు. వాటికి ఆహారంపెట్టి ఆప్యాయంగా వాటిని నిమిరాడు. ఆ తరువాత కొన్ని సంవత్సరాల క్రితం తనతో అడవికి తీసుకువచ్చిన కర్ర, భిక్షాపాత్ర తీసుకుని నెమ్మదిగా పట్టణం వైపు బయలుదేరాడు. అడవిలో ఉన్న తపస్వి తన

కుటీరాన్ని వదిలి మళ్ళీ నగర ప్రవేశం చేసాడన్న వార్త క్షణాల్లో దశదిశలా వ్యాపించింది. ఈ వింతైన సన్నివేశాన్ని చూడడానికి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. దాదాపు దేవునిలో ఐక్యమయ్యేంతగా భగవదారాధనలో గడిపిన తాపసి, అవన్నీ వదిలేసి మళ్ళీ ప్రజా జీవితంలోకి రావడం వల్ల లోకానికి కీడేదో జరుగుతుందని కొందరు భయపడ్డారు. మార్గానికి ఇరువైపులా భక్తిభావంతో నిలబడిఉన్న ప్రజల్ని అభినందించే ప్రయత్నంలో చిరునవ్వుతో విరాట్ ముందుకు నడిచాడు. కాని నవ్వడం కూడా కష్టంగా అనిపించింది, నవ్వడానికి కూడా మనసు రావడంలేదు. ఆయన కళ్ళు గంభీరంగా ఉన్నాయి. పెదాలు విడివడీ విడవడకుండా ఉన్నాయి.

చివరికాయన రాజభవనానికి చేరుకున్నాడు. రాజుగారి కొలువు ముగిసింది. ఆయన ఒంటరిగా ఉన్నాడు. విరాట్ లోపలికి వచ్చాడు. రాజుగారు విరాట్‌ని ఆలింగనం చేసుకునేందుకు తన పీఠం నుంచి లేచారు. కాని ఈ లోగానే విరాట్ ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఏదో కోరబోతున్నాననే దానికి గుర్తుగా రాజుగారి దుస్తుల్ని తాకాడు.

"చెప్పకముందే మీ కోరికను మన్నిస్తున్నాం. ఒక మహానుభావుడికి, ఒక సాధువుకు సేవ చేసే అవకాశం లభించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తాను," అన్నారు మహారాజు.

"నన్ను సాధువు అని పిలవకండి. ఇప్పటివరకు గడిచిన నా జీవన మార్గం సరైంది కాదు. ఇప్పటివరకు నేను కాలచక్రంలో పడి దిక్కుతోచక తిరుగుతున్నాను. నేనిప్పుడు మీముందు కార్యార్థినై నిలబడ్డాను. పాపభీతితో ఇప్పటివరకు సమస్త కార్యాలకు దూరంగా ఉండిపోయాను. కాని అదో భ్రమ. నావల్ల ఇతరులు కూడా ఆ భ్రమలో చిక్కుకున్నారు."

"మీ మాటలు నాకు నమ్మశక్యం కాకుండా ఉన్నాయి. మనుషులకు దూరంగా ఏకాంతవాసం గడుపుతూ వాళ్ళకు ఏ హాని చేయగలరు? నిరంతరం దైవచింతనలో ఉంటూ పాప పంకిలంలో పడిపోయానంటే ఎట్లా?"

"నేను కావాలని, తెలిసి తప్పు చేయలేదు. నేను పాపాలనుంచి దూరంగా వెళ్ళాను. కాని మన కాళ్ళు ఈ భూమితో బంధింపబడి ఉన్నాయి. మన కర్మలన్నీ నిత్య నియమాలతో పెనవేసుకుని ఉన్నాయి. నిష్కర్మ కూడా ఒక కర్మ. చనిపోయిన నా సోదరుని చూపుల నుంచి నేను తప్పించుకోలేకపోయాను.

"నేను అనేకసార్లు అపరాధాలు చేశాను. పరమాత్మ నుంచి దూరంగా పారిపోయాను. మానవసేవకు దూరమయ్యాను. నా జీవితం వ్యర్థమయింది. ఇతరులకు సేవ చేయడానికి బదులు నా జీవితాన్ని నేను పోషించుకుంటూ వ్యర్థంగా గడిపాను. ఇప్పుడు నేను సేవ చేద్దామనుకుంటున్నాను."

"మీ మాటలు నాకు చాలా కొత్తగా ఉన్నాయి విరాట్. నా అవగాహనకు అందడం లేదు. మీ కోరిక ఏమిటో చెప్పండి నేను నెరవేరుస్తాను."

"ఇక నుంచి పనిలేకుండా ఖాళీగా ఉండదలుచుకోలేదు. అన్ని బంధాలకు దూరంగా, స్వేచ్ఛగా ఉన్నాననుకుంటున్న వ్యక్తి నిజంగా స్వేచ్ఛగా లేడు. కర్మలకు దూరంగా ఉండే వ్యక్తి కూడా పాపాలనుంచి దూరంగా ఉండలేడు. సేవ చేసేవాడు, తన మన:శ్శక్తిని ఇతరులకు అందించగలిగిన వాడు, తన శారీరక శక్తుల్ని కర్మలో నిమగ్నం చేసేవాడు, తర్కించక కార్యాచరణకు సిద్ధపడేవాడు మాత్రమే నిజమైన స్వతంత్రుడు. ఒక పనిని నిర్వర్తించడమే మన పని. దాని ప్రారంభం, ముగింపు, దాని ప్రభావం, దాని ఫలితం అన్నీ భగవంతుని చేతిలో ఉన్నాయి. నా అభిష్టాన్నుంచి నాకు స్వేచ్ఛనివ్వండి. ఇష్టపడటం అనేది ఒక గందరగోళం. సేవ చేయడం అనేది జ్ఞానం."

"నువ్వు చెప్పేదేమీ నాకు అర్థం కావడంలేదు. ఒకవైపు ఈ బంధనాల నుంచి దూరంగా ఉంచమంటావు. మరోవైపు సేవ చేసే అవకాశం కల్పించమంటావు. ఇతరులకు సేవ చేసేవాడే స్వతంత్రుడని నీ అర్థమా? సేవ చేయించుకునేవాడు నీ దృష్టిలో స్వతంత్రుడు కాదన్నమాట. నువ్వు చెప్పేది నాకు అవగాహన కావడం లేదు."

"అదంతే మహారాజా, మీ హృదయంతో ఈ విషయాన్ని అర్థం చేసుకోలేరు. అది మీకు బోధపడితే మహారాజుగా ఎలా కొనసాగుతారు? ఇతరులనెలా ఆదేశించగలుగుతారు?"

మహారాజు ముఖం క్రోధంతో నల్లబడింది, "అంటే నువ్వు చెప్పేదాన్ని బట్టి భగవంతుని దృష్టిలో సేవకుడికన్నా మహారాజు అల్పుడనే కదా!"

"భగవంతుని దృష్టిలో ఎవరూ ఎవరికన్నా అల్పులూ కారు, అధికులూ కారు. ఇతరులకు సేవ చేసేవాడు, తర్కించక కోర్కెలను అదుపులో ఉంచుకునేవాడు మాత్రమే తన అహం నుంచి విముక్తుడు కాగలడు. పరమాత్మకు అంకితం కాగలడు. కానీ, కోర్కెలున్నవాడు, జ్ఞానంతో వాటిని జయించగలననుకుంటాడు. దురాకర్షణకు లోనై పాపాలలో పడిపోతాడు."

మహారాజుగారికి కోపం ఎక్కువయింది, "అయితే అన్ని సేవలూ ఒకటేనంటావు. మనిషి దృష్టిలోనూ, భగవంతుని దృష్టిలోనూ ఉన్నత సేవ, అల్పసేవ అనేవి లేవంటావు?"

"మనుషుల దృష్టిలో ఒక సేవకంటే ఇంకొకటి గొప్పగా కనిపించవచ్చు. కాని భగవంతుడి దృష్టిలో మాత్రం అన్ని సేవలూ సమానమే."

మహారాజుగారు చాలాసేపు కోపం, దిగులు మిళితమైన దృష్టితో విరాట్‌ను చూస్తూ ఉండిపోయాడు. ఆయన ఆత్మాభిమానానికి గట్టి దెబ్బ తగిలింది. అలిసిపోయి ఉన్న విరాట్

ముఖాన్ని, ముడుతలు పడిన నుదుటిపై పడుతున్న తెల్లటి జుట్టుని చూస్తూ ఈ ముసలివాడికి పిచ్చెక్కిందేమోనన్న అనుమానం వచ్చింది మహారాజుకి. అనుమానం దేనికి పరీక్షిస్తే సరిపోతుంది కదా అనుకుని, “అయితే నువ్వు మా కోటలో వేట కుక్కల సంరక్షకుడిగా పనిచేస్తావా?” అని అడిగాడు.

విరాట్ శిరస్సు వంచి కృతజ్ఞతా పూర్వకంగా సింహాసనాన్ని ముద్దుపెట్టుకున్నాడు.

నాలుగు ఉత్తమ గుణాలతో ఆ రాజ్యమంతా పేరుమోసిన ఆ వృద్ధుడు రాజభవనం పక్కనే ఉన్న కుక్కల చావిడిలో కుక్కల సంరక్షకుని హోదాలో సాధారణ నౌకర్లతోపాటు ఆ గదుల్లోనే నివశించసాగాడు.

ఆయన కొడుకులకి ఆయన వల్ల తల కొట్టేసినట్టయింది. వాళ్ళు ఎప్పుడైనా కుక్కల చావిడి మార్గంలో వెళ్ళవలసి వచ్చినా అటు వెళ్ళకుండా ఎంత దూరమైనా తిరిగి వేరే మార్గంగుండా వెళ్ళేవాళ్ళు. ఆయన ముఖం చూడడమే వాళ్ళకు ఇష్టంలేదు. ఆయన మా తండ్రి అని ఇతరులకు చెప్పుకోవడం కూడా వాళ్ళకు ఇష్టంలేదు. పనికిమాలినవాడని పూజారులు ఆయన్ను నిరసించేవాళ్ళు.

కుక్కల సంరక్షకుడుగా చేరిన కొత్తలో విరాట్ కుక్కలకు కట్టిన తాళ్ళు పట్టుకుని బయట తిప్పడానికి తీసుకువెళుతుంటే అందరూ ఆయన్ను ఆశ్చర్యంగా ఆగి మరీ చూసి వెళ్ళేవాళ్ళు. ఒకప్పుడు మహారాజు గారికి అత్యంత ముఖ్యుడుగా ఉండిన అతను కుక్కలు కాయడం అందరికీ వింతగా ఉండేది. విరాట్ అదేమీ పట్టించుకునేవాడు కాదు. చూసి చూసీ ప్రజలకు ఆ దృశ్యం మామూలయింది. విరాట్ గురించి వాళ్ళు ఆలోచించడం కూడా మానేశారు. ప్రధాన న్యాయాధికారి పదవిని ఎంత గౌరవంగా భావించాడో కుక్కల సంరక్షకుడి పదవినీ విరాట్ అంతే గౌరవంగా భావించాడు.

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా విరాట్ విధి నిర్వహణలో నిమగ్నమై ఉండేవాడు. కుక్కల్ని శుభ్రంగా తోమేవాడు. వాటి వస్తువుల్నీ శుభ్రంగా ఉంచేవాడు. వాటికి భోజనం పెట్టడం, వాటి విశ్రాంతికి ఏర్పాట్లు చెయ్యడం, వాటి మల మూత్రాదులను శుభ్రపరచడం మొదలైన పనుల్ని చాలా ఆత్మీయంగా, బాధ్యతగా చేసేవాడు. కొద్ది రోజుల్లోనే రాజభవనంలోని జనంకన్నా కుక్కలు ఆయన్ను అమితంగా ప్రేమించసాగాయి. దీనికి ఆయన ఎంతో సంతోషపడ్డాడు.

పెద్ద మార్పులేమి లేకుండానే చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. విరాట్ చాలా ముసలివాడైపోయాడు. పళ్ళు కూడా ఊడిపోయాయి. ఎప్పుడోగాని మాట్లాడేవాడు కాదు. సమాధానంగా చిరునవ్వు నవ్వేవాడు.

ఈలోపు మహారాజుగారు కూడా చనిపోయారు. మరో కొత్త రాజుగారు వచ్చారు. విరాట్ ఎవరు, ఏమిటి అనేది కొత్త రాజుగారికి తెలియదు. ఒకసారి రాజుగారు వెళుతుంటే వారిని చూసి కుక్క మొరిగినందుకు కోపంతో కుక్కల సంరక్షకుడైన విరాట్‌ని పిలిచి బెత్తంతో ఒక దెబ్బ కొట్టారు. సమయం గడిచేకొద్దీ బంధువులు, మిత్రులు, కుటుంబ సభ్యులు అందరూ ఆయనను మరిచిపోయారు.

కొంత కాలానికి ఆయన మరణించినప్పుడు బానిసలను దహనం చేసే శ్మశానంలో అనాథ ప్రేతాలను దహనం చేసేవాళ్ళు ఆయనను దహనం చేశారు. నాలుగు ఉత్తమ గుణాలతో రాజ్యమంతా పేరుగాంచిన ఆయనను అప్పటికి అంతా మరిచిపోయారు. ఆయన కొడుకులెవరూ ఆయన దరిదాపులకు రాలేదు. ఆయన కర్మకాండలు జరపడానికి పూజారులు ఎవరూ రాలేదు. కుక్కలు మాత్రం రెండు రోజులపాటు తిండి తిప్పలు మానేసి రాత్రింబవళ్ళు మొరిగాయి. ఆ తరువాత అవి కూడా యజమానిని మరిచిపోయాయి. ఆయనను గురించి యోధుల చరిత్రలో గాని, మహాత్ముల గ్రంథాల్లోగాని ఎక్కడా ఒక్క మాట కూడా రాయలేదు.



స్టెఫాన్ జ్వైక్ ప్రపంచ ప్రసిద్ధ రచయితల్లో ఒకరు. కథకుడుగా, వ్యాసకర్తగా, నాటక రచయితగా, కవిగా సాహిత్యంలో ఆయన స్థానం చిరస్మరణీయమైంది. సుమారు 40 భాషల్లోకి 'విరాట్' అనువదించబడింది. కొన్ని లక్షల ప్రతులు అమ్ముడుపోయాయి.

స్టెఫాన్ జ్వైక్ 1915-16 ప్రాంతాల్లో భారతదేశానికి వచ్చారు. భారతీయ తత్వశాస్త్రం అంటే ఆయనకు చాలా ఇష్టం. మన వేదాల్ని, ఉపనిషత్తుల్ని, పురాణాల్ని, భగవద్గీతని అధ్యయనం చేశారు.

స్టెఫాన్ జ్వైక్ 1881 నవంబర్ 28న వియన్నా (ఆస్ట్రియా)లో జన్మించారు. ఆస్ట్రియా, ఫ్రాన్స్, జర్మనీలలో విద్యాభ్యాసం చేశారు. కీర్తికాంక్ష ఏ మాత్రం లేని నిరాడంబర వ్యక్తి. గొప్ప ఆత్మాభిమాని, పదవులకు, బిరుదులకు, అధ్యక్షతలకు, సభ్యత్వాలకు, సన్మానాలకు జీవితాంతం చాలా దూరంగా ఉన్నారు.

ఆయన 'యూదు' కావడం వల్ల నాజీల నిరంకుశత్వానికీ, అణచివేతకు గురైనారు. నాజీ పోలీసులు ఈయన పుస్తకాల్ని వెతికి వెతికి తగలబెట్టారు. అక్కడ నుంచి తప్పించుకుని భార్యతో సహా మొదట ఇంగ్లండ్‌కు, తరువాత బ్రెజిల్‌కు పారిపోయారు. చివరికి 1942 ఫిబ్రవరి 22న తన 61వ ఏట భార్యతోపాటు ఆత్మహత్య చేసుకున్నారు.

జ్వైక్ రచనల్లో 'విరాట్' అపూర్వ కళాఖండం.

978-93-80153-31-5

మంచి పుస్తకం